Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 248 మేడ్చల్ మల్కాజ్‌గిరి 27 సెప్టెంబర్ 2023 బుధవారం పేజీలు : 4

## రూ.2 వేల నోట్లు ఇంకా మార్చుకోలేదా..

### మిగిలింది 3 రోజులే.. ఆలస్యం చేస్తే అంతే..

ఢిల్లీ: ఆర్బీఐ గైడ్ లైన్స్ ప్రకారం.. ఈ నెల 30 దాటితే రూ.2 వేల నోటు భారత్‌లో చెల్లుబాటు కాదు. ఆ నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలని ఆర్బీఐ గతంలోనే గడువు విధించింది. ఈ గడువు సెప్టెంబర్ 30తో ముగుస్తుంది. ఇంకా ఎవరి దగ్గరైనా రూ.2 వేల నోటు ఉంటే వెంటనే బ్యాంకుకు వెళ్లి మార్చుకోవడం ఉత్తమం. నిజానికి ఈ నోటు మార్పిడి ప్రక్రియ మే 23న ప్రారంభమైందన్న విషయం తెలిసిందే.

**డిపాజిట్ ఇలా..** ఎలాంటి నిర్దిష్ట పరిమితి లేకుండా వ్యక్తులు తమ బ్యాంకులో రూ.2 వేల నోట్లను డిపాజిట్ చేసుకోవచ్చని ఆర్బీఐ పేర్కొంది. బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ లేదా జన్ ధన్ ఖాతా ఉపయోగిస్తున్న వారికి, సాధారణ డిపాజిట్ పరిమితులు అమలులో ఉంటాయి. ఖాతాలలో నిర్దిష్ట మొత్తానికి మించి నోట్లను డిపాజిట్ చేయాలనుకుంటే... కొన్ని పరిమితులకు కట్టుబడి ఉండాలి.

# బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి..

# కాంగ్రెస్ హౌస్‌ఫుల్..!




## తెలంగాణలో మారుతున్న సమీకరణలు..

హైదరాబాద్ : ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలంగాణ రాజకీయాలు హీటెక్కుతున్నాయి. రాజకీయ పార్టీలు ఎత్తుకు పైఎత్తులు.. వ్యూహ ప్రతివ్యూహాలతో దూసుకెళ్తున్నాయి. ఎన్నికలకు మరికొన్ని రోజులే మిగిలున్నాయి. దీంతో కొత్త కొత్త ప్రణాళికలతో పాచికలు వేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలు షాక్ అయ్యేలా ముందుగానే గులాబీ బాస్ అభ్యర్థులను ప్రకటించేశారు. ఇక ప్రధాన ప్రత్యర్థి పార్టీలు ఇంకా సమాలోచనలు.. సంప్రదింపుల్లోనే సతమతం అవుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ కేవలం దరఖాస్తులు మాత్రమే స్వీకరించింది. కానీ అభ్యర్థుల ఎంపిక మాత్రం ఇంకా కొలిక్కి రాలేదు. ఎంపికపై మల్లగుల్లాలు పడుతూనే ఉన్నాయి. అధికారంలోకి రావాలంటే ఏం చేయాలి? ఎవరికి సీటు ఇవ్వాలి? ఎవరు గెలుస్తారు?, ఇలా గెలుపు గుర్రాలను ఎంపిక చేసే పనిలో నిమగ్నమైపోయాయి. అక్టోబర్ మొదటి వారంలోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీ అభ్యర్థులను ఢీకొట్టేందుకు కాంగ్రెస్, బీజేపీ ఎలాంటి కసరత్తు చేస్తుందో మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది. ఇదిలా ఉంటే రాజకీయ వలసలతో కాంగ్రెస్ హౌస్‌ఫుల్ అయినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌లోకి వెళ్లినవారంతా తిరిగి సొంత గూటికి వచ్చేస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి చెందిన కంభం అనిల్ కుమార్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఈయన భువనగిరి సీటును ఆశించి బీఆర్ఎస్‌లో భంగపడ్డారు. అనిల్.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచరుడిగా గుర్తింపు ఉంది. కానీ ఆయనతో విభేదాలు కారణంగానే బీఆర్ఎస్‌లో చేరినట్లు సమాచారం. కానీ కాంగ్రెస్ చేయించిన సర్వేలో కచ్చితంగా అనిల్ గెలుస్తున్నట్లు తేలినట్లు తెలుస్తోంది. దీంతో కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ.వేణుగోపాల్, తెలంగాణ కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగోలు సూచనతో వెంటనే అనిల్ ఇంటికి వెళ్లిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలో చేర్చేసుకున్నారు. ఈ సీటు గెలవడం ఖాయమని కాంగ్రెస్ హైకమాండ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అంతకముందు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాకతో ఖమ్మం కాంగ్రెస్‌లో బలం పుంజుకుంది. ఇంతలోనే తుమ్మల నాగేశ్వరరావు రాకతో ఆ బలం మరింత రెట్టింపు అయింది. ఇలా వలసలతో కాంగ్రెస్ మంచి ఊపులో ఉంది. అంతేకాదు ఇప్పుడు బీఆర్ఎస్‌లో సీటు రాక భంగపడ్డ సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ వైపే చూస్తున్నారని తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, బోథ్ ఎమ్మెల్యే బాపూరావు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కూడా ఈ జాబితాలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. త్వరలోనే వీరంతా హస్తం గూటికి చేరే అవకాశం ఉన్నట్లు పొలిటికల్‌గా చర్చ నడుస్తోంది. ఇక తాజా పరిణామాలపై బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు తెలుస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలంతా తిరుగుబావుటా ఎగరేయడంతో అధిష్టానం దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లుగా తెలుస్తోంది. ఓ వైపు బుజ్జగింపులు చేస్తున్నా.. నేతలు మాత్రం అవేమీ పట్టించుకోకుండా గట్టు దూకేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కసిరెడ్డి నారాయణరెడ్డితో మంత్రి కేటీఆర్ సంప్రదింపులు జరిపినా.. ఆ ప్రయత్నాలు ఫలించలేదని సమాచారం. ఈ పరిస్థితుల్లో ఎప్పుడెవరు కారు దిగుతారో అర్థం కాక గులాబీ పార్టీలో గుబులు మొదలైంది. మరోవైపు కాంగ్రెస్ వ్యూహాలు కూడా సీఎం కేసీఆర్‌కు అంతుచిక్కడం లేదని తెలుస్తోంది. రోజురోజుకూ కాంగ్రెస్ పంజుకోవడంతో కేసీఆర్ ఎలాగైనా ఇబ్బంది పెట్టాలని ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది.

# తుమ్మల వర్సెస్ పొంగులేటి...



## కాంగ్రెస్‌కు కొత్త టెన్షన్!

ఖమ్మం : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి.. కర్నాటక ఎన్నికల ఫలితాలకు ముందు, ఆ తర్వాత అన్నట్లుగా మారిపోయాయన్నా అతిశయోక్తి కాదేమో. కారణం.. ఆ ఫలితాలు ఒక్కసారి తెలంగాణ కాంగ్రెస్ లో కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. బీఆరెస్స్ కు ప్రత్యామ్నాయం బీజేపీ లేక కాంగ్రెస్ అనుకుంటున్న దశలో కాస్త క్లారిటీ ఇచ్చిన ఫలితాలవి! నాటి నుంచి కాంగ్రెస్ క్యాడర్ లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఇదే సమయంలో చేరికలు కూడా భారీగా జరిగాయి. అధికార బీఆరెస్స్ లో అసంతృప్తులకు ఫస్ట్ ఆప్షన్ గా కాంగ్రెస్ పార్టీ మారింది. అందులో భాగంగానే ఖమ్మం జిల్లాలో బలమైన నేతగా ఉన్న పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఖమ్మం జిల్లాలో ఫిజికల్ గా, తెలంగాణ రాష్ట్రం మొత్తంలో మోరల్ గా పార్టీకి కొత్త బలం వచ్చిందనే కామెంట్లు వినిపించాయి. అనంతర పరిణామాలతో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సైతం బీఆరెస్స్ నుంచి బయటకు వచ్చి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అయితే ఇద్దరూ ఇప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లా పాలేరు మీదే మనసుపడ్డారు. అవును... పాలేరు నియోజకవర్గం పై అటు పొంగులేటీ ఎప్పుడో కర్చీఫ్ వేశారని కథనాలొచ్చిన నేపథ్యంలో... పాలేరు పై ఆశతోనూ, హామీతోనూ తుమ్మల కాంగ్రెస్ లో చేరారని చెబుతున్నారు. మరోపక్క తన వైఎస్సార్ టీపీని కాంగ్రెస్ లో విలీనం చేసిన అనంతరం షర్మిళ కూడా కాంగ్రెస్ టిక్కెట్ పై పాలేరు నుంచే పోటీ చేస్తారనే వార్తలు వచ్చాయి. దీంతో ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో పాలేరు నియోజకవర్గ పంచాయతీలు మొదలయ్యాయని తెలుస్తుంది. ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పాలేరు లో పోటీచేసేది ఎవరు అనే విషయం హాట్ టాపిక్ గా మారింది. మరి ఈ సమస్యను కాంగ్రెస్ పెద్దలు ఎలా పరిష్కరిస్తారనేది వేచి చూడాలి. కాగా... 2018 ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఉపేందర్ రెడ్డి తర్వాత బీఆరెస్స్ లో చేరిపోయారు. అయినప్పటికీ అక్కడ కాంగ్రెస్ కేడర్ మాత్రం అలా బలంగానే ఉందని అంటున్నారు. దీంతో ఇక్కడ నుంచి పోటీచేయడం కోసం స్థానిక కాంగ్రెస్ నాయకులతోపాటు షర్మిళ కూడా పోటీ పడుతున్నారని తెలుస్తుంది.

# పల్లాకు టికెట్.. మరి ముత్తిరెడ్డికి?



హైదరాబాద్ : తెలంగాణలో హ్యాట్రిక్ విజయం సాధించాలన్నదే బీఆర్ఎస్ లక్ష్యం. ఆ దిశగా పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ కసరత్తులు చేస్తున్నారు. ఇప్పటికే 115 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించారు. టికెట్ దక్కని కొంతమంది నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మిగతా నాలుగు స్థానాల్లో టికెట్ల కోసం హోరాహోరీ పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడింట్, మంత్రి కేటీఆర్ ఒక్కొక్కరిని బుజ్జగిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంకా టికెట్ ప్రకటించిన జనగామ నియోజకవర్గంపై ఫోకస్ పెట్టిన కేటీఆర్.. ఇక్కడ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి మధ్య విభేదాలను పరిష్కరించారు. దీంతో పల్లా విజయం కోసం పనిచేస్తానని ముత్తిరెడ్డి చెప్పినట్లు తెలిసింది. జనగామలో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ముత్తిరెడ్డి ఉన్నారు. కానీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు కాకుండా ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డికి టికెట్ ఇచ్చేందుకు కేసీఆర్ మొగ్గు చూపుతున్నారని తెలిసింది. ఈ సమాచారం తెలుసుకున్న ముత్తిరెడ్డి తనకే టికెట్ ఇవ్వాలని పట్టుబట్టారు. ఆవేదనతో కన్నీళ్లు కూడా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో జనగామ టికెట్ ఎవరికి అనే సందిగ్ధత నెలకొంది. కానీ ఇప్పుడు పల్లాతో పాటు ముత్తిరెడ్డిని పిలిపించుకుని కేటీఆర్ మాట్లాడారు. ముత్తిరెడ్డికి టికెట్ ఇవ్వకపోతుండటానికి కారణాలను కేటీఆర్ వివరించినట్లు తెలిసిందే. టికెట్ ఇవ్వకపోయినా భవిష్యత్లో సముచిత స్థానం కల్పిస్తామని ముత్తిరెడ్డికి కేటీఆర్ హామీ ఇచ్చినట్లు సమాచారం. మొత్తానికి జనగామ టికెట్ పల్లా రాజేశ్వర్ రెడ్డికి దక్కడం ఖాయమైంది. ఈ నేపథ్యంలో స్థానాన్ని త్యాగం చేస్తున్న ముత్తిరెడ్డికి కేసీఆర్ ఏ పదవి ఇస్తారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వేములవాడ ఎమ్మెల్యేగా ఉన్న చెన్నమనేని రమేశ్కు టికెట్ దక్కని సంగతి తెలిసిందే. కానీ ఆయన్ని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా క్యాబినేట్ హోదా పదవితో కేసీఆర్ బుజ్జగించారు. మరి ఇప్పుడు ముత్తిరెడ్డికి కూడా అలాంటి పదవే ఇస్తారా? అన్నది చూడాలి. లేదంటే రాష్ట్ర రైతుబంధు సమితి అధ్యక్షుడిగా ఉన్న పల్లా స్థానంలోకి ముత్తిరెడ్డిని తీసుకుంటారా? మరోవైపు రైతు బంధు సమితి అధ్యక్షుడిగా తాటికొండ రాజయ్యను నియమిస్తారనే ప్రచారం సాగుతోంది. స్టేషన్ ఘన్ పూర్లో కడియం శ్రీహరి కోసం టికెట్ ను సిట్టింగ్ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్య వదులుకునేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు ముత్తిరెడ్డిని ఎమ్మెల్సీగా చేసి.. అనంతరం మంత్రిని చేస్తారనే ప్రచారం కూడా సాగుతోంది.

# ‘కీ’ రోల్ వాళ్లదే..!



## భారీగా పెరిగిన యువ ఓటర్లు!!

## వాళ్లపైనే అన్ని పార్టీల దృష్టి!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకు సమయం దగ్గర పడుతుంటే రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. అన్ని పార్టీలు యుద్ధ ప్రాతిపదికన వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. అధికార బి ఆర్ ఎస్ మూడోసారి అధికారంలోకి రావాలని వ్యూహాలు రచిస్తూ ఉంటే, ఈసారి బీఆర్ఎస్ పార్టీని గద్దె దించాలని కాంగ్రెస్, బిజెపిలు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. ఇక ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న క్రమంలో మెజారిటీ ఓటు బ్యాంకుని తమ ఖాతాలో వేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు కసరత్తులు ముమ్మరం చేశాయి. ముఖ్యంగా పార్టీలన్నీ తమ ఫోకస్ ను యువత పైన పెట్టిన పరిస్థితి ప్రస్తుతం తెలంగాణలో కనిపిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో నియోజకవర్గాల వారీగా గతం కంటే ఎక్కువగా యువఓటర్లు నమోదుకావడంతో వారు ఏ పార్టీకి మద్దతు ఇస్తారు అనేది అన్ని రాజకీయవర్గాల్లోనూ ఆసక్తికర చర్చకు కారణంగా మారింది. ఏపీ, తెలంగాణకు ఎల్లో అలర్ట్ యూత్ పైనే అన్ని రాజకీయ పార్టీలు ప్రస్తుతం ఫోకస్ పెట్టిన పరిస్థితి ఉంది. ఇటీవల ఈసీ ప్రకటించిన డ్రాఫ్ట్ ఓటర్ల లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 3,06, 42,333 మంది ఓటర్లు ఉండగా 18 ఏళ్ల నుండి 19 సంవత్సరాల మధ్య వయసు వారు 7లక్షల మంది దాకా ఉన్నారు. 19 ఏళ్ల నుండి 35 ఏళ్ల వయసు వారు 75 లక్షల మంది ఉన్నారు. ఇక ఫైనల్ ఓటర్ల జాబితాలో యువ ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో మొత్తం ఓటర్లలో 30 శాతం మంది యువత ఉండడంతో ప్రధాన పార్టీలన్నీ ఫోకస్ యువత పైన పెట్టినట్టుగా తెలుస్తుంది. యువతకు మద్దతుగా ఉద్యోగాల కోసం, నిరుద్యోగ సమస్యపై పోరాటం చేస్తూ ప్రభుత్వం పైన ఒత్తిడి తెస్తూ బిజెపి, జాబ్స్ విషయంలో యూత్ డిక్లరేషన్ ప్రకటించి కాంగ్రెస్ పార్టీ యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. ఇక యువతను తమ వైపు తిప్పుకోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ టిఎస్పిఎస్సి పేపర్ లీకేజీలు బి ఆర్ ఎస్ కు పెద్ద తలనొప్పిగా మారాయి. అయితే యువ ఓటర్లను టార్గెట్ చేస్తూ అన్ని పార్టీలు వ్యూహాలలో రచిస్తున్న వేళ వచ్చే ఎన్నికలలో యువత ఎవరికి పట్టం కడుతుంది అన్నది ఆసక్తికరంగా మారింది.

# సంపాదకీయం

## భారత్ లో ప్రవేశానికి ఎలాన్ మస్క్ కొత్త వ్యూహం ఇదే!

టెస్లా, స్పేస్ ఎక్స్, ట్విట్టర్ కంపెనీల అధినేత ఎలాన్ మస్క్ గురించి తెలియనివారు లేరు. ప్రపంచంలోనే అపర కుబేరుడయిన మస్క్ ఇప్పుడు భారత్ పై దృష్టి సారించారనే వార్త హాట్ టాపిక్ గా మారింది. ఎలాన్ మస్క్ కు చెందిన కార్ల కంపెనీ.. టెస్లా భారత్ మార్కెట్ వైపు దృష్టి పెట్టింది. భారతీయ ఆటోమొబైల్ మార్కెట్ రోజు రోజుకి శర వేగంగా ప్రగతి పథంలో దూసుకుపోతోంది. కార్ల విక్రయాలు భారీ ఎత్తున జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అనేక కంపెనీలు భారత్ ను లక్ష్యంగా చేసుకున్నాయి. కొత్తగా వస్తున్న ఏ ఆధునిక టెక్నాలజీ కారయినా మొదటగా భారత్ లోనూ ప్రవేశిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికన్ బ్రాండ్ అయిన టెస్లా కూడా భారత్ లో ప్రవేశించడానికి రంగం సిద్ధం చేసుకుందని తెలుస్తోంది. అంతేకాకుండా ఎలక్ట్రిక్ కార్లకు, విద్యుత్ బ్యాటరీలకు కూడా డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో టెస్లా కంపెనీ భారత్‌లో బ్యాటరీ స్టోరేజీ ఫ్యాక్టరీని కూడా ఏర్పాటు చేయనుందని తెలుస్తోంది. ఇటీవల మన దేశంలో టెస్లా కార్ల తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి ఎలాన్ మస్క్ ప్రధాని నరేంద్ర మోడీతో చర్చలు జరిపారు. ఇందులో భాగంగానే సుమారు 24,000 కోట్ల డాలర్ల విలువైన ప్లాంట్ ను భారతదేశంలో ఏర్పాటు చేస్తానని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ముందుగా భారత్ లో బ్యాటరీ స్టోరేజ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి.. తయారీ – విక్రయం వంటి వాటికి కూడా మస్క్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సోలార్ ప్యానల్స్, గ్రిడ్ నుంచి విద్యుత్ ను నిల్వ చేసుకుని రాత్రి సమయంలో లేదా విద్యుత్తుకు అంతరాయం కలిగిన సందర్భంలో ఉపయోగించుకోవడానికి ఇలాంటి బ్యాటరీలు ఉపయోగపడతాయని చెబుతున్నారు. ఈ క్రమంలో బ్యాటరీ స్టోరేజ్ ఫ్యాక్టరీ నిర్మించడానికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాకాలను కోరుతూ ఇప్పటికే ఎలాన్ మస్క్ భారత ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించినట్లు తెలుస్తోంది. టెస్లా ప్రతిపాదనకు ప్రభుత్వం కూడా సుముఖత చూపే అవకాశం ఉందని అంటున్నారు. అయితే దీనికి సంబంధించిన అధికారిక సమాచారాన్ని అటు టెస్లా ప్రతినిధులు కానీ, ఇటు భారత ప్రభుత్వం కానీ తెలపలేదు. వార్తలు వచ్చినట్టు జరిగితే టెస్లా భారతదేశంలో అడుగుపెట్టడం ఖాయమేనని అంటున్నారు. అలాగే ఇప్పటికే ఈ రంగంలో ఉన్న కంపెనీలను కూడా అధిగమిస్తుందనే అంచనాలు ఉన్నాయి. బ్యాటరీ ఫ్యాక్టరీ ప్రస్తుతం దేశానికి చాలా అవసరమని నిపుణులు కూడా చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కరెంటుకు అంతరాయం కలిగినప్పుడు ఇలాంటి వాటిని ఉపయోగించుకోవచ్చని పేర్కొంటున్నారు. ముఖ్యంగా బొగ్గు తదితరాల కర్బన ఉద్గారాలను వెలువరించే వాటి స్థానంలో ప్రత్యామ్నాయాలపై ప్రభుత్వాలు కూడా దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో టెస్లా మన దేశంలో అడుగుపెట్టడానికి ఇదే సరైన సమయం అంటున్నారు.

### నిరంకుశ పాలనకు చరమ గీతం పాడటమే తన సంకల్పంగా ముందుకు సాగిన వీర వనిత

## ఘనంగా (చిట్యాల) చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు...



శామీర్ పేట : తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత, చిట్యాల (చాకలి) ఐలమ్మ128వ జయంతి సందర్భంగా మంగళవారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలో మూడుచింతలపల్లి రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ జామురవి తో పాటు వివిధ పార్టీ నాయకులు విచ్చేసి వీరనారి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, ప్రజాస్వామిక పోరాటాలు స్ఫూర్తిగా నిలిచాయని చెప్పారు.భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన తెగువ, పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటి చెప్పాయని అన్నారు. తెలంగాణ మట్టిలోనే పోరాట తత్వం ఉందని చెప్పడానికి ఐలమ్మ జీవితమే నిదర్శనమని చెప్పుకొచ్చారు. హక్కులకోసం ఐలమ్మ చేసిన ఆత్మగౌరవ పోరాట స్ఫూర్తి తో తెలంగాణ ప్రజల హక్కుల సాధన కోసం, రాష్ట్ర ప్రభుత్వం కృషి సాగిస్తున్నదని వివరించారు. ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తూ నబ్బంద వర్గాల త్యాగాలను స్మరించుకుంటున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటరమణారెడ్డి, వార్డు సభ్యులు వేణుగోపాలరావు, రాజేంద్రప్రసాద్ గౌడ్, బూరుగు యాదగిరి,బాలమల్లేష్, వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వంగభూపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జెర్రిపోతుల నరసింహులు, రజక సంగం నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## నగరానికి దూరం.. నిర్వహణ భారం

నిజామాబాద్: అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను అందిస్తున్న ఇందూరు జిల్లా.. ప్రపంచంలోనే ప్రత్యేకంగా నిలుస్తోంది. పలువురు జిల్లావాసులు దేశంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. జిల్లాకు క్రీడల్లో ఆయువుపట్టైన నిజామాబాద్ నగరంలోని మైదానంలో వసతులు లేక క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరానికి దూరంగా నిర్మించిన రాజారాం స్టేడియం నిర్వహణ లేక అవస్థలు పడుతున్నారు. నాగారంలోని రాజారాం స్టేడియం దాదాపుగా 25 ఎకరాల్లో ఉంది. అప్పటి మంత్రి సుదర్శన్‌రెడ్డి ఖలీల్‌వాడిలోని మైదానాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించి.. అక్కడ ఉన్న స్టేడియాన్ని నాగారంనకు తరలించారు. జిల్లాకేంద్రం నుంచి దూరంగా ఉండటం, తల్లిదండ్రులు తమ పిల్లలను పంపడానికి విముఖత చూపడంతో క్రీడా సంఘాల వారు పాత కలెక్టరేట్ మైదానంలోనే శిక్షణ ఇస్తూ వస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలు ఇక్కడే నిర్వహిస్తున్నారు.



**దుమ్ము లేస్తే అంతే..**

మైదానం చుట్టూ పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని కలిగించేలా ఉన్నా నీటి సౌకర్యం లేక ఎండిపోయే పరిస్థితి తలెత్తుతోంది. సాధన సమయంలో, పోటీల నిర్వహణలో క్రీడాకారులు వినియోగించేందుకు, మైదానంలో దుమ్ము లేస్తే నీటిని చల్లడానికి అవకాశం లేకపోవడం ఆందోళనకరం.

**ఖాళీ స్థలం తప్ప..**

చుట్టూ ప్రహరీ, ఒకపాత భవనం, ఖాళీ స్థలం తప్ప ప్రత్యేకంగా క్రీడాకారుల కోసం ఏర్పాట్లు ఏమీ లేవు. భవనంలో క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన జిమ్ సామగ్రి తుప్పుపట్టే స్థితిలో ఉన్నాయి. కనీసం ప్రవేశ గేటుకు పేరు లేకపోవడం దారుణం. మరుగుదొడ్లు వాడలేని దుస్థితి. క్రీడాకారిణులు దూరంగా ఉండాల్సిందే.

**ఏర్పాట్లపై దృష్టిసారించాలి**

నారాయణ, వాకర్స్ సంఘం అధ్యక్షుడు

పెవిలియన్ వద్ద స్టాండ్స్ పైన రేకులు పూర్తిగా లేవు. ఇక్కడ ఏవైనా పోటీలు జరిగితే చూడటానికి ఇవి ఉపయోగపడతాయి. మైదానం చుట్టూ మొక్కలు నాటాలి. వసతుల కల్పనకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

**కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం**

ముత్తెన్న, డీవైఎస్‌వో

మైదానంలో నిర్వహణకు నిధులు కేటాయించలేదు. ఇక్కడ నీటి వసతి కోసం బోరు వేయించాలని గత కలెక్టర్ నారాయణ రెడ్డికి విన్నవించాం. ఈ సమస్యను పరిష్కరించేలోపే బదిలీపై వెళ్లారు. ప్రస్తుత కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

# శివారు.. బేజారు..!



మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రం రోజురోజుకు విస్తరిస్తోంది.. కాలనీలు పెరుగుతుండగా అందుకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలు కరవయ్యాయి.. మంచినీరు అన్ని కాలనీలకు సరిగా అందడం లేదు.. వేసవి సమీపిస్తోంది.. జిల్లా కేంద్రంలో మిషన్ భగీరథ పనులు ఐదేళ్లుగా కొనసాగుతున్నాయి. విలీన గ్రామాలు మినహాయించి పాత పురపాలక సంఘం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఇంకా ఇంటింటికి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఇవ్వలేదు. ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా మిషన్ భగీరథ నీటిని దశాబ్దాల కిందట నిర్మించిన పాత పైపులైన్ ద్వారానే పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్నారు.

**పట్టణంలో పనులు ఇలా..**

పట్టణంలో రోజూ పది ఎంఎల్‌డీ నీటిని వినియోగించుకోవల్సి ఉంది. ఓవర్ హెడ్ ట్యాంక్‌లు పూర్తి కాకపోవడం, శివారు ప్రాంతాల్లో పైపులైన్ అసంపూర్తిగా ఉండడం వల్ల 7ఎంఎల్‌డీ నీరు మాత్రమే అందుతోంది. 2018లో మొదటగా మిషన్ భగీరథ పథకానికి రూ. 56 కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో పనులు ప్రారంభించిన ఏజెన్సీ మొదట్లోనే ఆ పనులను నిలిపివేశారు. ఆ టెండర్లను రద్దు చేసి 2020 లో రూ. 44.33 కోట్లు మంజూరు చేశారు. మరో సంస్థ చేపట్టిన రెండో ప్రాజెక్ట్ పనులు ప్రారంభించి రెండేళ్లు గడిచినా ఇంకా పూర్తి కాలేదు. నాలుగు ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు గానూ రెండు ట్యాంకులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా రెండు ట్యాంక్‌ల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ప్రధాన పైపులైన్ నిర్మాణంతో పాటు డిస్ట్రీబ్యూషన్ లైన్ ఏర్పాటు పనులు కూడా పూర్తి కాలేదు. పలు చోట్ల నిర్మించిన పైపులు లీకేజీ, ధ్వంసం కావడం వల్ల వివిధ ప్రాంతాలకు తరచుగా నీటి సరఫరా నిలిచిపోతుంది.

**నిలిచిపోయిన ప్రధాన పైపులైన్ నిర్మాణాలు**

రైల్వే లైనింగ్ క్రాసింగ్ వద్ద పైపులు ఏర్పాటు చేయాలి. సిగ్నల్ కాలనీలో గ్యాస్ గోదాం వద్ద పరుపు బండను తొలగించాలి. కంకరబోడ్ సంపు వద్ద రోడ్ క్రాసింగ్ వల్ల ప్రధాన పైపులైన్ పూర్తి కాలేదు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో డిస్ట్రీ బ్యూషన్ పైపులైన్ నిర్మించ లేదు. మదర్‌థెరిసా కూడలి నుంచి వివేకానంద సెంటర్ వరకు ఒక వైపు కొత్త పైపులైన్ నిర్మించలేదు. వెంకటేశ్వరబజార్, పత్తినాక, సిగ్నల్ కాలనీ, కృష్ణ కాలనీ, అడ్వకేట్స్ కాలనీ, బీఎన్.గుప్తా కాలనీ, బ్యాంక్ కాలనీ, ఎల్‌బీజీ నగర్, ఏటిగడ్డ తండాతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో పాతపైపులైన్ ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారు.

**బిల్లులు రాకనే..**

పట్టణంలో 2020 ఆగస్టులో మిషన్ భగీరథ పనులు ప్రారంభించారు. 2022 ఆగస్టు వరకు పనులు పూర్తి చేయాల్సి ఉంది. గుత్తేదారులు చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్లనే ఇతర పనుల్లో జాప్యం జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ పథకానికి రూ. 44.33 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 120 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణ పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే పూర్తైన పనికి సుమారు రూ. 31.80 కోట్లు బిల్లులు చెల్లించాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా కేవలం సుమారు రూ. 6.80 మాత్రమే చెల్లించినట్లు తెలుస్తోంది. దీంతో మిగిలిన పనులు ఎలా చేయాలంటూ సంబంధిత సంస్థ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు.

**విస్తరిస్తున్న కాలనీలకు ప్రతిపాదనలు**

మహబూబాబాద్ పట్టణంలో కొత్తగా ఏర్పాటైన శివారు ప్రాంతాల్లోని కాలనీల్లో ఇంకా మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభించలేదు. 2018కి ముందు అప్పటి జనాభా అవసరాలకు అనుగుణంగా మిషన్ భగీరథ పథకానికి అంచనాలు పంపించగా నిధులు మంజూరయ్యాయి. జిల్లా కేంద్రంగా ఏర్పాటైన తర్వాత పట్టణం రోజు రోజుకు విస్తరిస్తోంది. దీంతో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రాంతాలకు మిషన్ భగీరథ నీటిని అందించేందుకు అమృత్ పథకం ద్వారా నిధులు మంజూరుకు రూ. 31 కోట్లు ప్రతిపాదనలు పంపించారు. ఆ నిధులు మంజూరైతే వివిధ ప్రాంతాల్లో మిగిలిపోయిన నూతన పైపులైన్ నిర్మాణం, ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఇవ్వనున్నారు.

## మొక్కుబడిగా క్రీడా ప్రాంగణాలు

కరీంనగర్ : కట్టరాంపూర్‌లో గతేడాది జూన్ 2న ప్రారంభించిన క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ పిట్ మాత్రమే ఏర్పాటు చేశారు. మరో నాలుగు రకాల పరికరాలు బిగించాల్సి ఉండగా ఆరు నెలలుగా అడుగు ముందుకు పడడం లేదు.పిల్లల శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసంతో ఎదిగేందుకు వీలుగా వార్డులు, డివిజన్లు, గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ఆరు నెలల కిందట చర్యలు ప్రారంభించింది. అన్ని మున్సిపాలిటీలు, నగరపాలి కల్లో క్రీడల కోసం ఆట మైదానాలు ఉండేలా లక్ష్యాన్ని విధించింది. దీంతో కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు పలు పట్టణాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటు ప్రయత్నాలు ఆశించిన మేర ఫలితాలు ఇవ్వడంలేదు.

**స్థలాల కొరత.. దూరంగా మైదానాలు**

తెలంగాణ క్రీడా ప్రాంగణం (టీకేపీ–అర్బన్) పేరుతో ప్రతీ మున్సిపాలిటీలో క్రీడా ప్రాంగణాలు నిర్మించేందుకు వార్డుల వారీగా లక్ష్యాన్ని నిర్ణయించారు. ఒక్కో వార్డుకు కనీసం మూడు ఉండటంతో పాటు పేరుగాంచిన ఐదు



క్రీడలకు సరిపడా మైదానం ఒకే చోట ఉండాలని ఆదేశించారు. పట్టణాలు, నగరాల్లో దీనికోసం కావాల్సిన స్థలమే దొరకడం లేదు. ఉన్నచోటనే ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఉండగా.. మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం కనీసం ఓపెన్‌జిమ్ కోసం కొద్ది స్థలం కూడా దొరకడం లేదు. పలు ప్రాంతాల్లో జనావాసాలకు దూరంగా వీటిని ఏర్పాటు చేశారు. ఈ క్రీడా ప్రాంగణాల్లో ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్ జంప్ పిట్, వ్యాయామం చేసేందుకు సింగిల్, డబుల్ బార్ ఉండాల్సి ఉంటుంది.

**రూ.లక్షల్లో ఖర్చు**

నగరపాలక సంస్థ పరిధిలో ఐదు రకాల క్రీడా పరికరాలతో పాటు బోర్డు, గోడలకు రంగులు చేసేందుకు ఒక్కో దానికి రూ.5 లక్షలకు తగ్గకుండా ఖర్చు చేసినట్లుగా తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వ్యయం అధికం, పనులు నామమాత్రం అన్నట్లుగా ఉంది. పైగా ప్రజలకు ఉపయోగపడేలా ఆ పరికరాలు లేవు. ఆటలు ఆడుకునే సమయంలో మాత్రమే ఇవి ఉపయోగపడుతుండగా మిగతా సమయాల్లో వీటిని వదిలేస్తుండటంతో వాటిని కొందరు విరగ్గొట్టి ఎత్తుకెళ్తున్నారు.కట్టరాంపూర్, గౌతమినగర్ ప్రాంతంలో నిర్మించిన ప్రాంగణ ప్రహరీకి పగుళ్లు వస్తున్నాయి. పనులు చేయడం తప్ప నాణ్యత, క్యూరింగ్ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు.

**నాసిరకం పనులు**

నగరంలో 28 చోట్ల క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినట్లుగా అధికారులు చెబుతుండగా వాటిల్లో కొన్నిచోట్ల ఆ ఐదు ఆట పరికరాలు కూడా బిగించలేదు. కట్టరాంపూర్ నుంచి గౌతమినగర్‌కు వెళ్లేదారిలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయగా అందులో ఒక్క బార్ లేదు. బోర్డు ఏర్పాటు, చుట్టూ గోడలకు రంగులు వేసినా.. క్యూరింగ్, పర్యవేక్షణ లేకపోవడంతో ప్రహరీకి పగుళ్లు ఏర్పడ్డాయి. మొక్కుబడిగా వీటిని ఏర్పాటు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## 3,755 మందికి...7,681.13 ఎకరాలు

నిజామాబాద్: అటవీ భూముల్లో సాగు చేసుకుంటున్న వారికి హక్కులు కల్పించే ప్రక్రియ తుదిదశకు చేరింది. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల కోసం సుమారుగా 14 వేల మంది ఏడాది కిందట దరఖాస్తు చేశారు. మూడంచెల్లో పరిశీలన పూర్తి చేసి అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. వీరిలో 11 వేల మంది వరకు గిరిజనులున్నారు. తొలి విడతలో వీరి దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకొని ప్రక్రియ చేపట్టారు. గ్రామస్థాయి కమిటీలు ఆమోదం తెలిపిన దరఖాస్తులను డివిజన్‌స్థాయి కమిటీలు క్షేత్రస్థాయిలో పరిశీలించగా.. 4,972 మంది మాత్రమే కబ్జాలో ఉన్నట్లు ఆధారాలు లభించాయి. వీటిని రికార్డుల ఆధారంగా సరిచూసి 3,755 దరఖాస్తులకు ఆమోదం తెలిపారు. వీటిని జిల్లా కమిటీకి పంపి..పట్టాలు సిద్ధం చేయిస్తున్నారు.

**పెరిగిన అర్హులు..**

అటవీహక్కుల చట్టం ప్రకారం..2005 డిసెంబరు లోపు భూమి సాగు చేసుకుంటూ ఉండాలి. వచ్చిన దరఖాస్తులను అటవీశాఖ సాంకేతికంగా పరిశీలించగా.. దాదాపు 85–90 శాతం తిరస్కరణకు గురికావడంతో ఈ నివేదికను రెవెన్యూ యంత్రాంగం పరిగణనలోకి తీసుకోలేదు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఆధారాలు సేకరించింది. దీని ప్రకారం అర్హుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. డివిజన్ కమిటీ పరిశీలనలోనూ అటవీ, పంచాయతీరాజ్, సిబ్బంది భాగంగా ఉండి పరిశీలిస్తున్న క్రమంలో చాలావరకు దరఖాస్తుదారులు మోకామీద లేరని గుర్తించారు. ఈ క్రమంలో మోకా మీద ఉన్నవారినే పరిగణనలోకి తీసుకొని చట్టం వర్తింపజేసి అర్హులను ఎంపిక చేశారు. మైనర్లు కావడంతో..తొలుత ఎస్టీ కేటగిరీ దరఖాస్తులనే పరిశీలించారు. వీరు 11 వేల మంది ఉండగా.. ఇందులో మోకా ఆధారంగా చూస్తే.. కేవలం 4,972 మంది మాత్రమే ఉన్నారు. 11,500.17 ఎకరాల విస్తీర్ణానికి హక్కుల కోసం దరఖాస్తు చేయగా.. 7,681.13 ఎకరాలకు ఆమోదం లభించింది. చాలా మంది 2005 నాటికి మైనర్లుగా ఉండటంతో చట్టం వర్తింపజేయటం ఇబ్బందిగా మారింది. నిబంధనల ఆధారంగా 3,755 మందిని ఇప్పటి వరకు డివిజన్ కమిటీలు ఎంపిక చేసి.. జిల్లా కమిటీకి పంపాయి. ఈ మేర పంపిణీకి ప్రస్తుతం ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు తయారవుతున్నాయి. అప్పీలుకు అవకాశం..అర్హుల జాబితాను ఈ నెలాఖరు వరకు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. తిరస్కరణకు గురైన వారికి సందేహాలుంటే.. ఏడాది లోపు పునఃపరిశీలన కోసం అప్పీలు చేయొచ్చు.

# రుణ మాఫీ చిక్కులు



సిరిసిల్ల : పంట రుణమాఫీ ప్రక్రియ రెండు నెలలు కావస్తున్నా పూర్తి కావడం లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం జిల్లాలో 2018 డిసెంబరు 11 నాటికి 61,344 మంది రైతులు రూ.లక్ష లోపు రుణాలు రూ.455.11 కోట్లు తీసుకున్నారు. వీరిలో బంగారం తాకట్టు పెట్టి రుణాలు పొందిన వారు కూడా ఉన్నారు. ఈ నెల 20 నాటికి 33,518 మందికి వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ కావడంతో రూ. 186.64 కోట్లు మాఫీ అయ్యాయి. 54 శాతం మంది రైతులకు 40 శాతం నిధులు జమయ్యాయి. మిగతావి విడతల వారీగా జమవుతాయని వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకర్లు చెబుతున్నారు. పంట రుణాలు పొందిన రైతులు తమ ఖాతాల నిర్వహణ సరిగా లేక డిఫాల్టర్ కావడం, కొన్ని బ్యాంకులు విలీనం కావడం తదితర కారణాలతో వాటిని సరిచేసే క్రమంలో జాప్యం నెలకొంది. జాప్యానికి కారణాలు ఇవీ...పంట రుణం తీసుకున్న రైతులు వడ్డీ పెరుగుతుందనే ఉద్దేశంతో కొందరు ముందే చెల్లించి వారి ఖాతాలను మూసివేశారు. అప్పటికే వారి ఖాతా నంబరు రుణమాఫీ జాబితాలో ఉంది. సేవింగ్ ఖాతా ఉంటే అందులో జమ చేస్తున్నారు. లేని వారి నిధులు బ్యాంకులోనే ఉంటున్నాయి.

ఇటీవల కాలంలో పలు బ్యాంకులు విలీనమయ్యాయి. మండల కేంద్రాలు, గ్రామాల్లో ఉన్న మరికొన్ని బ్రాంచిలు మూసివేసి జిల్లాలకు మార్చారు. వీటిలో రైతు ఖాతాలు గుర్తించే ప్రక్రియ సాగుతోంది. రైతుల పేర్లు, చిరునామాలు, ఆధార్, ఫోన్ నంబర్ల అనుసంధాం చేశారా? అనే దానిపై పరిశీలిస్తున్నారు.

2018లో రైతు పట్టాదారు పాసు పుస్తకాలు పాతవి జత చేశారు. తర్వాత భూ దస్త్రాల ప్రక్షాళన జరిగింది. రికార్డులు పూర్తిగా ధరణి పోర్టల్‌లోకి మార్చారు. కొత్త పాసు పుస్తకాల జారీ ప్రక్రియ జరిగింది. ప్రభుత్వం బ్యాంకర్లకు రుణాల కోసం ధరణి లాగిన్ అనుమతులు కూడా ఇచ్చింది. కానీ అందులో పాత పాసు పుస్తకాల్లోని పేర్లకు కొత్త వాటిలోని పేర్లు కొన్ని సరిపోవడం లేదు. వీటి ధ్రువీకరణకు రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మరికొన్ని చోట్ల విస్తీర్ణం, గ్రామం తప్పుగా వచ్చాయి.

రైతులు అప్పుడు తీసుకున్న పంట రుణానికి వడ్డీకి రెండింతలైంది. దీంతో రైతులు రుణమాఫీకి వెళ్లినా మిగతా సొమ్ము చెల్లించాలని బ్యాంకుల వైపే వెళ్లడం లేదు.

కొందరు రైతులు ఒకే ఆధార్ సంఖ్యతో వేర్వేరు బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారు. రుణమాఫీ ఉన్న ఖాతాకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో నిధులు జమ కావడం లేదు.

**6,745 ఖాతాలు.. రూ. 47 కోట్లు**

2018 డిసెంబరు 11 నాటికి పంట రుణాలు తీసుకున్న రైతులకు ప్రభుత్వం మాఫీ వర్తింపజేసింది. తొలుత 2020 మేలో రూ.25 వేలలోపు ఉన్న వారికి రుణమాఫీ చేశారు. తర్వాత 2021లో రూ.50 వేలు తీసుకున్నవారికి చేస్తున్నట్లు ప్రకటించినా అవి పూర్తి కాకుండానే నిలిచిపోయాయి. తర్వాత ఈ ఏడాది ఆగస్టు 3న పూర్తిగా మాఫీ చేస్తామని ప్రకటించారు. ఈసారి కూడా జాప్యం వీడలేదు. ఇప్పటికే కొందరు రుణాలు చెల్లించి బ్యాంకు ఖాతాలను రద్దు చేసుకున్నారు. మరికొందరు రుణాలు నవీకరణ చేసుకోని వారి ఖాతాలు ఎన్‌పీఏ (నిరర్థక ఆస్తుల) జాబితాలో చేరాయి. ఇటువంటి వారికి మాఫీ నిధులు జమ కాలేదు. ఇలాంటివి జిల్లా వ్యాప్తంగా 6,745 మందికి చెందిన రూ. రూ.47.04 కోట్లు వెనక్కి వెళ్లాయి.

**సమాచారం లేదంటున్నారు**

మా గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో నేను రూ. 99 వేలు, మా భార్య చంద్రకళ పేరున రూ. 1.50 లక్షల పంట రుణం పొందాం. ఏటా బ్యాంకులో వడ్డీ చెల్లిస్తూ వస్తున్నాం. ఎవరికీ మాఫీ కాలేదు. బ్యాంకులో సమాచారం లేదని చెబుతున్నారు.

కేతిరెడ్డి రవీందర్‌రెడ్డి, నిజామాబాద్,కోనరావుపేట మండలం

వడ్డీ బకాయి లేదుమాకు అయిదెకరాల వ్యవసాయ భూమి ఉంది. నా పేరున రూ.2 లక్షలు, మా భార్య భూమమ్మ పేరున రూ.40 వేలు పంట రుణం తీసుకున్నాం. ఏటా క్రమం తప్పకుండా వడ్డీ చెల్లించి, రెన్యువల్ చేసుకుంటున్నాం. ఇటీవల మాఫీ చేస్తున్నట్లు సమాచారం తెలుసుకుని బ్యాంకుకు వెళ్లి అధికారులను అడిగితే ఉన్నతాధికారులకు పంపించామంటున్నారు. రూ.లక్ష లోపు మాఫీ చేస్తారని అయిదేళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నాం.ఎనుగుల నర్సయ్య, రహీంఖాన్‌పేట, ఇల్లంతకుంట మండలం

# ఆరింటిపై తకరారు..!

నల్గొండ: కాంగ్రెస్ అభ్యర్థులను ఎంపిక చేసే స్క్రీనింగ్ కమిటీలో చర్చంతా ఎక్కువగా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని స్థానాలపైనే జరిగిందని విశ్వసనీయంగా తెలిసింది. మొత్తం పన్నెండింటిలో ఆరింటికి అభ్యర్థుల ఎంపిక దాదాపు పూర్తి కాగా.. మరో ఆరింటిపై పీటముడి పడినట్లు పార్టీ వర్గాల సమాచారం. ఎంపీలు ఉత్తమ్, కోమటిరెడ్డిలకు హుజూర్‌నగర్, నల్గొండ ఖరారు కాగా...సీనియర్ నేత జానారెడ్డి లేదా ఆయన కుటుంబానికి నాగార్జునసాగర్, ఆలేరులో బీసీ కోటాలో బీర్ల అయిలయ్య, దేవరకొండలో మాజీ ఎమ్మెల్యే బాలునాయక్ పోటీ చేయడం దాదాపు ఖాయమైందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. తొలి విడతలో ఈ ఐదు స్థానాలను ప్రకటిస్తారని పార్టీ కీలక సభ్యుడొకరు వెల్లడించారు.

సూర్యాపేట స్థానంలో పార్టీ అభ్యర్థి ఎంపిక స్క్రీనింగ్ కమిటీ కీలక సభ్యుల మధ్య విభేదాలు రాజేసింది. సర్వేల ఆధారంగానే టిక్కెట్ కేటాయింపులు ఉంటాయని పదేపదే టీపీసీసీ వెల్లడిస్తున్న నేపథ్యంలో పార్టీ టిక్కెట్ ఆశిస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి రమేశ్‌రెడ్డిలకు సర్వేలు దాదాపు సమానంగా అనుకూలంగా ఉన్నాయని సమాచారం. దీంతో సీనియర్ కోటాలో దామోదర్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని జిల్లాకు చెందిన స్క్రీనింగ్ కమిటీ సభ్యుడొకరు వాదించగా.. గతంలో ఇచ్చిన హామీ మేరకు రమేశ్‌రెడ్డికి ఇవ్వాలని మరో సభ్యుడి తీవ్రంగా వాదించినట్లు సమాచారం. జిల్లాకు చెందిన మరో కీలక నేత అభిప్రాయం ఇప్పుడు కీలకంగా మారింది. దీంతో తొలి జాబితాలో సూర్యాపేట ఉండకపోవచ్చని సమాచారం.

నల్గొండ పార్లమెంటు పరిధిలో రెండు స్థానాలను బీసీలకు కేటాయించాలనే డిమాండ్ నేపథ్యంలో మిర్యాలగూడపై స్క్రీనింగ్ కమిటీలో చర్చ జరిగిందని తెలిసింది. కమ్యూనిస్టులతో పొత్తు కుదిరితే ఈ స్థానాన్ని వారికి కేటాయించేలా పరిశీలించాలని చర్చ రాగా... పొత్తులు కుదిరినప్పుడు మాట్లాడుదామని...ఇక్కడి టిక్కెట్ కేటాయింపు విషయంలో సీనియర్ నేత జానారెడ్డి అభిప్రాయాన్ని తప్పకుండా తీసుకోవాలని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. భువనగిరి పార్లమెంటు పరిధిలోని భువనగిరి, మునుగోడు స్థానాల్లో అభ్యర్థులు ఎవరనేది జనగామ నియోజకవర్గం అభ్యర్థి ఖరారుపై ఆధారపడి ఉంది. జనగామలో పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల పోటీ చేయడం ఖాయమైతే...ఆలేరులోనూ బీసీ కోటాలో బీర్ల అయిలయ్య టిక్కెట్ ఆశిస్తున్నారు. దీంతో రెండు స్థానాల్లోనూ బీసీలే ఉండటంతో మునుగోడు, భువనగిరిలో రెడ్డి సామాజికవర్గానికి టిక్కెట్ కేటాయించే అవకాశం ఉంటుంది. ఒకవేళ జనగామలో రెడ్డి సామాజిక వర్గానికి ఇస్తే భువనగిరి, మునుగోడుల్లో ఒక స్థానంలో బీసీకి టిక్కెట్ ఇవ్వాల్సి ఉంటుందని కమిటీ భేటీలో చర్చ సాగినట్లు తెలిసింది. ఇటీవల పార్టీలో చేరిన జిట్టా బాలకృష్ణారెడ్డితో పాటు పంజాల రామాంజనేయులుగౌడ్, శివరాజ్‌గౌడ్ భువనగిరి టిక్కెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

కోదాడ నుంచి తన సతీమణి పద్మావతి పోటీ చేస్తారని ఇప్పటికే ఎంపీ ఉత్తమ్ ప్రకటించారు. అయితే నల్గొండ పార్లమెంటు పరిధిలో బీసీ స్థానం కేటాయింపు అంశం తెరమీదకు వస్తోందని...అనూహ్య పరిణామం ఏర్పడితే తప్ప అభ్యర్థి పద్మావతే పోటీలో ఉంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. మునుగోడులో గత ఉప ఎన్నికల్లో పోటీ చేసిన పాల్వాయి స్రవంతితో పాటు టిక్కెట్ ఆశించిన చల్లమల్ల కృష్ణారెడ్డి ఆశావహులుగా ఉన్నారు. బీసీ కోటాలో పున్నా కైలాశ్ దిల్లీ వెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. జనగామలో జనరల్‌కు టిక్కెట్ ఇస్తే మునుగోడులో తప్పకుండా తనకు అవకాశాలుంటాయని కైలాశ్ ఆశాభావంతో ఉన్నారు. రేవంత్‌రెడ్డి ద్వారా తనకే అవకాశాలుంటాయని కృష్ణారెడ్డి బలంగా నమ్ముతున్నారు.

మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం ఈ నెల 26న లేదా 28న కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఈ మేరకు ఆయన దిల్లీలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో పాటు సీనియర్ నేతలను కలిశారు. రాహుల్‌గాంధీ అనూహ్యంగా రాజస్థాన్ పర్యటనకు వెళ్లడంతో వీరేశం చేరిక సాధ్యం కాలేదు. ఆయనతో పాటు మరికొంత మంది నేతలు హైదరాబాద్‌లో ఠాక్రే సమక్షంలో పార్టీలో చేరనున్నారు. వీరేశంతోపాటు దిల్లీ వెళ్లిన పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు శనివారం ఠాక్రే సమక్షంలోనే కాంగ్రెస్‌లో చేరారు. కాగా, నకిరేకల్, తుంగతుర్తిలో ఎక్కడ పోటీ చేయాలనే దానిపై వీరేశానికి పార్టీ అధిష్ఠానం స్పష్టత ఇవ్వలేదని సమాచారం. ఆయన నకిరేకల్‌లో పోటీకి సుముఖత చూపిస్తున్నారు. కానీ తుంగతుర్తిలో పోటీకి సిద్ధం కావాలని పార్టీ సూత్రప్రాయంగా తెలపగా... నకిరేకల్‌లో తనకంటూ వర్గం ఉందని, ఇంత తక్కువ కాలంలో తుంగతుర్తిలో పోటీ సాధ్యపడదని వీరేశం అధిష్ఠానానికి వెల్లడించినట్లు తెలిసింది. సీనియర్ నేతతో చర్చలు జరుగుతున్నాయని అనూహ్య పరిణామాలు ఏర్పడితే తప్పితే వీరేశం నకిరేకల్ నుంచే కాంగ్రెస్ తరఫున పోటీలో ఉండనున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# గురుకులాల్లో సంభాషణా నైపుణ్యం

భువనగిరి : విద్యార్థుల్లోని సృజనాత్మకత బయటకు రావాలంటే పాఠశాలలో బోధన స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాలన్నది సత్యం. ప్రభుత్వ ఆదేశాల మేరకు సంస్థపరంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు ఇప్పటికే చాలా కార్యక్రమాలు అమలవుతున్నాయి. ఆ క్రమంలో భాగంగానే తాజాగా మరో రెండు విన్నూత్నమైన కార్యక్రమాలకు పూనుకుంది. వాటిలో 'సంభాషణ నైపుణ్యాల పెంపు', 'టాకథాన్' కోసం వంద రోజుల సమగ్ర ప్రణాళిక అమలు చేయాలని కార్యాచరణ రూపొందించింది. ఇటీవలనే ఈ కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో లాంఛనంగా ప్రారంభించగా, వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 వరకు ఇవి కొనసాగనున్నాయి. ఐదు నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులను భాగస్వామ్యం చేయనుండగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 25 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన 10వేల మంది సద్వినియోగ పరచుకుంటున్నారు. భాషలో ప్రావీణ్యం, సంభాషణా చాతుర్యం..విద్యార్థులను తెలుగు, హిందీ, ఆంగ్లం భాషల్లో నైపుణ్యం కోసం ప్రోత్సహిస్తారు. ఇందుకు విషయాల వారీగా నలుగురు చొప్పున గ్రూపులుగా విభజించి అయిదు నిమిషాల పాటు విద్యార్థుల చేత ఆ విషయంలో మాట్లాడేలా చూస్తారు. ఏడు విషయాల ఉపాధ్యాయులు ప్రతి తరగతిలో విద్యార్థులు 13 రోజుల్లో మాట్లాడే విధంగా శిక్షణ ఇస్తుంటారు. మౌఖిక ఉపన్యాసాలు, పదజాలం, పాఠ్యసారాంశం వంటి అంశాలపై విద్యార్థులతో మాట్లాడించి వారి నైపుణ్యాన్ని అంచనా వేస్తారు. దీనికి సాయంత్రం 4.15 నుంచి 4.30 గంటల వరకు సమయాన్ని కేటాయించారు.

దిక్సూచిగా టాకథాన్ అన్ని సబ్జెక్టుల్లో ప్రతి ఉపాధ్యాయుడు కఠిన పదాలు గుర్తించి పటాలతో వివరణ ఇస్తారు. గణితంలో వెన్‌చిత్రాలు, టేబుల్స్ విశ్లేషణ వంటి అంశాల మీద రోజుకు ముగ్గురి చొప్పున ప్రతి విద్యార్థి ఏదో ఒక అంశంపై మాట్లాడేలా చూస్తారు. టాకథాన్ కోసం ప్రత్యేకంగా సమయంటూ లేకున్నా ఉపాధ్యాయులు 40 నిమిషాల పీరియడ్ వ్యవధిలోనే అయిదు నిమిషాలు కేటాయించాల్సి ఉంటుంది.కొత్త అంశాలు తెలుసుకుంటున్నాంకర్రె దినేశ్, ఆరోతరగతితరగతి గదిలోని సంభాషణ ఆంగ్లంలో చాట్స్ మీద రాసి గోడలకు అతికిస్తున్నాం. వీటిని సందర్భానుసారంగా వినియోగిస్తున్నాం. ఆంగ్లంలో కొత్త అంశాలు తెలుసుకుంటున్నాం. ఆంగ్లంలో మాట్లాడేందుకు ఈ కార్యక్రమంలో ఎంతో దోహదపడుతుంది. తరగతిలో ఎలాంటి భయం లేకుండా మాట్లాడగలుగుతున్నా.పట్టు లభిస్తోంది డి.కల్యాణ చక్రవర్తి, ఆంగ్లం సంభాషణ నైపుణ్యాల సమన్వయకర్తసంభాషణ నైపుణ్యాలతో పాటు టాకథాన్ కార్యక్రమాలు నిర్వహించడంతో విద్యార్థులకు అన్ని అంశాలపై మంచి పట్టు ఏర్పడుతుంది. భాషా నైపుణ్యాలు మెరుగు పడతాయి. ప్రతిరోజు ఈ తరగతులు కొనసాగనుండటంతో విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తుతాయి. ప్రత్యేకంగా ఆంగ్లం, గణితంలో సదరు విద్యార్థులకు కొత్త అంశాలు తెలుసుకునే వీలు కలుగుతుంది.

# వృద్ధి చెందుదాం.. చెలరేగుదాం!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి.. తీవ్ర జ్వరాలతో డెంగీ లక్షణాలతో పలువురు మరణిస్తున్నారు.. జనం జాగ్రత్తలు పాటించకపోవడం.. అధికారుల వైఫల్యం దోమల విజృంభణకు కారణమవుతోంది.. ఈ నేపథ్యంలో దోమల కోణంలో ప్రస్తుత పరిస్థితిపై కథనం..'దోమ.. దోమ ఎందుకు కుట్టావ్ అని అంటున్నారు.. కుట్టడం మన జాతి లక్షణం కదా.. ఈ జనమే పరిశుభ్రత పాటించక మన సంఖ్య పెంచుతారు.. రోగ నిరోధక శక్తి పెంచేకోక.. మనం కుట్టగానే రోగాల పాలవుతారు.. మన తప్పేంటి.. వారు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే మన వృద్ధి ఆగుతుంది.. మంచి ఆహారం తీసుకుంటే.. వ్యాయామంతో శరీరాన్ని దృఢంగా చేసుకుంటే మనం ఎంత కుట్టినా వారికేం కాదు.. ఆ విషయం పట్టించుకోక మనపై అబాంఢాలు వేస్తారు.. ఒకే ఇంటిలో అందరినీ కుడుతున్నా.. కొందరు మాత్రమే వ్యాధుల బారిన పడటానికి కారణం వారిలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటమే.. వారు ఆ దిశగా ఆలోచించడం లేదు.. వారి నిర్లక్ష్యమే వారికి చేటు చేస్తోంది.. అది గుర్తించకపోతే మనమేం చేస్తాం' అని ఓ పెద్ద దోమ ఆవేశంగా ప్రసంగిస్తోంది.. కరీంనగర్ సమీపాన శనివారం ఉదయం ఉమ్మడి జిల్లా దోమల సంఘం సమావేశం వాడీవేడిగా సాగింది.. చాలా రోజులుగా స్తబ్ధుగా ఉన్న వివిధ రకాల దోమల సంఘాలు ఇటీవల వాటి ప్రతాపంతో జనాన్ని జ్వరాల బారిన పడేలా చేస్తుండటంతో ఈ సమావేశం ఏర్పాటు చేసుకున్నాయి.. ఇంతలో డెంగీ కారక ఏడిస్ రకం దోమలు వందల సంఖ్యలో వస్తుండటం చూసి మిగతావి ఆశ్చర్యపోయాయి.. వేయి దోమలకు ఒక ప్రతినిధి రావాల్సి ఉండగా.. ఏడిస్ దోమలు వందల సంఖ్యలో రావడమేంటని విస్తుపోగా.. నవ్వుతూ ఆ దోమల ప్రతినిధి ఎందుకు ఆశ్చర్యపోతున్నారు మిత్రమా.. మా బలగం పెరిగింది అందుకే ఎక్కువ సంఖ్యలో వస్తున్నాం అని పేర్కొంది.. తరచూ వర్షాలు పడుతున్నాయి.. వీధుల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచి ఉంటోంది.. ఇళ్లలోని పూల కుండీలు.. టైర్లు, కొబ్బరి బోండాలు.. డ్రమ్ముల్లో నిలిచి ఉన్న నీటితో మా సంఖ్య పెరిగింది.. అధికారులు డ్రైడే గురించి ప్రచారం చేసినా ఆచరిస్తున్న జనం తక్కువే.. అందుకే మరింత వృద్ధి చెందామని చెప్పింది. తరువాత సమావేశం కొనసాగింది. ఇటీవల డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతుండటంతో నాలుగు జిల్లాల నుంచి ఆ ప్రతినిధులకే మాట్లాడటానికి అవకాశం దక్కింది.

కరీంనగర్ ఏడిస్ దోమల ప్రతినిధి మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటిదాకా 113 డెంగీ కేసులు నిర్ధారణ అయ్యాయని చెప్పింది. మూడేళ్ల కిందట కరోనా రావడంతో జనం పరిశుభ్రతపై దృష్టి పెట్టారని, బలవర్ధక ఆహారం తిన్నారని రోగ నిరోధక శక్తి పెంచుకున్నారని చెప్పింది. పరిశుభ్రత చర్యలతో తమ సంతతి వృద్ధి తగ్గిందని.. ఉన్న కొద్ది దోమలు కాటేసినా జనం తట్టుకోగలిగారని పేర్కొంది. ప్రస్తుతం వారు మళ్లీ జంక్‌ఫుడ్‌కు, బయటి ఆహారాలపై ఆసక్తి చూపుతున్నారని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత విషయంలో అప్పటిలా జాగ్రత్తలు తీసుకోవడం లేదని, ఇదే తమకు ఆయుధమైంది అని చెప్పింది. వారిలో రోగ నిరోధకశక్తి తగ్గడంతో తమ కాటుకు ప్లేట్‌లెట్స్ తగ్గి రూ.వేలల్లో ఖర్చు చేసుకుంటున్నారని చెప్పింది. కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి పురపాలికల్లో తమదే హవా అని గతంలో మాదిరిగా ఫాగింగ్ చేయకపోవడం, గంబూసియా చేపలను, ఆయిల్ బాల్స్‌ను మురుగు కుంటల్లో వదలడాన్ని యంత్రాంగం మరవడం అన్ని రకాల దోమల వృద్ధికి కారణమైందని చెప్పింది.

జగిత్యాల జిల్లా ఏడిస్ దోమల ప్రతినిధి తమ ప్రగతి సమావేశం ముందుంచుతూ జిల్లాలో వర్షాలు అధికంగా కురిసి ఎక్కడికక్కడే మురుగు నీటి కుంటలు పెరగడం తమతోపాటు మిత్ర దోమల వృద్ధికి కలిసి వచ్చిందని చెప్పింది. తమను నియంత్రించడానికి ప్రజలు ఇంటికి రెండు, మూడు ఎలక్ట్రిక్ బ్యాట్‌లు, కాయిల్స్, రసాయన ద్రావణాలను కొనుగోలు చేస్తున్నారని సగటును నెలకు ఓ కుటుంబం రూ.100కుపైగా ఖర్చు చేస్తోందని, ఈ లెక్కన 2.32 లక్షల కుటుంబాలు నెలకు తమను చంపేందుకు రూ.2.32 కోట్లు ఖర్చు చేస్తున్నాయని చెప్పింది. కానీ సాయంత్రాలు తమ కాటుబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్న జనం ఉదయం సమయంలో తలుపులు బార్లా తెరిచి తమను ఇళ్లలోకి ఆహ్వానిస్తున్నారని చెప్పింది. ఒళ్లంతా కప్పి ఉంచేలా దుస్తులు ధరించడం ద్వారా తమ కాటు తప్పించుకునే అవకాశమున్నా పట్టించుకోవడం లేదంది. ఇదే తమకు అవకాశమై గత నెలలో 24 మంది డెంగీ బారిన పడగా.. ఈ నెలలో 58 మంది బాధితులయ్యారని పేర్కొంది. ఈ ఏడాదిలో 90 డెంగీ కేసులు నమోదవడం తమ పనితీరుకి నిదర్శనమని తెలిపింది. జిల్లాలో సహచర దోమల ధాటికి ప్రతి గ్రామంలో ఇంటికొకరైనా వివిధ రకాల జ్వరాలతో ఆస్పత్రులకు వెళ్తున్నారని చెప్పింది.

ఓ వైపు స్వచ్ఛతాహీ సేవా, స్వచ్ఛ సర్వేక్షణ్, దర్పణ్‌లతో పల్లె, పట్టణాల్లో పరిశుభ్రతకు అధికారగణం, ప్రజాప్రతినిధులు పాటుపడుతున్నా.. తమ ప్రాబల్యాన్ని నిలబెట్టుకునే విధంగా తమ జోరుని చూపిస్తున్నామని రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి చెప్పింది. ఇప్పటి వరకు మిగతా జిల్లాలతో పోలిస్తే తక్కువగా 8 డెంగీ కేసులు మాత్రమే నమోదయ్యాయని.. ఈ సంఖ్య పెంచడానికి కృషి చేస్తామని చెప్పింది. డెంగీ తక్కువగా ఉన్నా మిగతా దోమల ప్రభావం, వాతావరణ మార్పులు, అపరిశుభ్ర పరిసరాల వల్ల జనం వివిధ రకాల జ్వరాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపింది.

చివరగా ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్ష దోమ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో రోజుకు సగటున 4,200 మంది ప్రభుత్వ ఆస్పత్రులకు వెళుతున్నారని.. ప్రైవేటు కెళ్లేవారు ఇంతకు రెండింతలు ఉంటారని.. జనం నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడమే ఇందుకు కారణమంది. ఈ జోరును ఇలాగే కొనసాగిద్దామని.. వచ్చే నెల చివరి వారంలో జరిగే సమావేశం వరకు ఎవరు ఏమేర ప్రగతి సాధించారో పూర్తి నివేదికతో రావాలని సూచించింది.

పెద్దపల్లి జిల్లా నుంచి వచ్చిన ఏడిస్ దోమ మాట్లాడుతూ తమతోపాటు అనాఫిలిస్, క్యూలెక్స్ తదితర రకాల దోమలు సంఘటితంగా ప్రజలపై దాడి చేస్తున్నాయని చెప్పింది. ఏ చిన్న అవకాశాన్ని వదలట్లేదని.. గోదావరిఖనిలోని ప్రభుత్వ దవాఖానాకు సగటున రోజుకు 300 మంది తమ వల్లనే వెళ్తున్నారని, ఆగస్టులో నలుగురికి డెంగీ వచ్చేలా చేశామని.. ఈ నెలలో ఇప్పటి వరకు ఒకరిని ఈ వ్యాధి బారిన పడేలా చేశామంది. టైఫాయిడ్, మలేరియా విస్తృతిని తమ సహచర దోమలు ఇంతకింతకు పెంచుతున్నాయని చెప్పింది.

# ఎన్నాళ్లీ అదనపు బాధ్యతలు

భువనగిరి : నూతన కార్యాలయాలు ఏర్పాటు చేశారు. పోస్టులు మంజూరు చేశారు... కానీ ఎవరికీ పోస్టింగ్‌లు ఇవ్వలేదు. కొన్నింటిని ప్రారంభించారు. మౌలిక సదుపాయాలు కల్పించలేదు. రోడ్ల భవనాల శాఖ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. అవి ప్రారంభించి రెండు నెలలకుపైకా గడుస్తున్నా అధికారులు, సిబ్బంది లేక నూతన కార్యాలయాలు బోసిపోతున్నాయి. ఉన్న సిబ్బంది, ఇంజినీర్లకు అదనపు బాధత్యలు ఇచ్చి నెట్టుకొస్తున్నారు. జీవో ఎంఎస్ నెంబర్ 51 ప్రకారంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో నూతనంగా ఒక సర్కిల్ కార్యాలయం, రెండు డివిజన్లు, 11 సబ్ డివిజన్లు, 18 సెక్షన్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ 27-12-2022న ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గత జూన్ 10న నూతన కార్యాలయాలు ప్రారంభించారు. సాంకేతిక, ఇతర సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించని కారణంగా చాలా చోట్ల పనులు సాగడం లేవు. పరిపాలన సౌలభ్యం కోసం పునర్ విభజన చేపట్టినా పూర్తి స్థాయి నియామకాలు, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరలేదు.

**తెరుచుకోని యాదాద్రి సర్కిల్ కార్యాలయం**

పరిపాలన సౌలభ్యం కోసం యాదాద్రి భువనగిరి, జనగాం, వైటీడీఏ డివిజన్లు కలిపి భువనగిరి కేంద్రంగా యాదాద్రి సర్కిల్ ఏర్పాటు చేశారు. పర్యవేక్షక ఇంజినీర్ (ఎస్ఈ)ని మాత్రం నియమించలేదు. ఇన్‌ఛార్జిగా నల్గొండ ఎస్ఈ ఎం.నర్సింహాకు అదనపు బాధ్యతలు అప్పగించారు. జూన్ 10న భువనగిరి పాత మున్సిపల్ కార్యాలయం పక్కన గల ఇ-సేవా కేంద్రం కార్యాలయ భవనంపై సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇక్కడ నుంచి కార్యకలాపాలు జరగడం లేవు. ఎస్ఈ, డీఈ, ఏఈ, సీనయర్ అసిస్టెంట్లు పోస్టులను భర్తీ చేయలేదు. ఒక అటెండర్‌ను ఈఈ కార్యాలయం నుంచి డిప్యూటేషన్‌పై నియమించారు. ఇటీవల పర్యవేక్షుడిని మాత్రం నియమించారు. తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం పురస్కరించుకుని సెప్టెంబరు 17 జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎప్పుడు చూసినా కార్యాలయం తాళం వేసి ఉంటుంది. ఎస్ఈ నియామకం జరగకపోవడం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో నల్గొండ నుంచే పనులు పర్యవేక్షిస్తున్నారు. జనగాం డివిజన్ వారు నల్గొండ వెళ్లి రావడానికి ఇబ్బంది పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇతర డివిజన్లు, సబ్ డివిజన్లది ఇదే పరిస్థితి. మిర్యాలగూడ డివిజన్‌కు నల్గొండ ఈఈ నరేందర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సబ్ డివిజన్లు, సెక్షన్లలో కూడా అదే పరిస్థితి. భువనగిరిలో పనిచేసే ఒక జేఈ రెండు సెక్షన్లకు అదనపు బాధ్యతలు చూస్తున్నారు. భువనగిరి డివిజన్‌కు భవనాలు, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్లు మంజూరు కాగా ఇటీవల క్వాలిటీ కంట్రోల్ డీఈని నియమించారు. మరో పోస్టు ఖాళీగానే ఉంది. ఈఈ, డిప్యూటీ ఈఈ, ఏఈ, ఏఈఈలు, సాంకేతిక, జూనియర్ అసిస్టెంట్లు సీనియర్ అసిస్టెంట్ల పోస్టులను భర్తీ చేయలేదు. ఇప్పుడిప్పుడే కొన్ని పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైంది. కొత్తగా జేఈల నియామకం చేపడితేకానీ ప్రస్తుతం పనిచేస్తున్న ఈఈ, డీఈఈ, ఏఈలకు పదోన్నతులు లభిస్తాయి. ఈ క్రతువు ముగిస్తే కానీ పూర్తి స్థాయిలో సాంకేతిక సిబ్బంది నియామకం సాధ్యం కాదని ఆర్ అండ్ బీ అధికారి అభిప్రాయపడ్డారు. అప్పటి వరకు అదనపు బాధ్యతలతో నూతన కార్యాలయాలు నడవాల్సిందే.

**ఉన్న వారికే అదనపు బాధ్యతలిచ్చాం**

ఎం.నర్సింహా, ఎస్ఈ, నల్గొండ

ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే నూతన కార్యాలయాల్లో పనులు జరిపిస్తున్నారు. ఈఈలు, డీఈ, ఏఈఈలకు అదనపు బాధ్యతలు ఇచ్చి పనులు జరిపిస్తున్నారు. పూర్తి స్థాయి సిబ్బందిలేక పోవడంతో ఇబ్బందులు ఉన్నది వాస్తవమే. త్వరలో నూతనంగా జేఈల నియామకం జరుగుతుంది. పూర్తి స్థాయి సిబ్బందిని నియమిస్తాం. అదనపు బాధ్యతలు చూస్తున్న భువనగిరి సర్కిల్‌లో పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవడంతో నల్గొండ నుంచే పాలన నిర్వహిస్తున్నాం.

# ప్రతి పల్లెకు ప్రభుత్వ వైద్యం

నిజామాబాద్ : వైద్య సేవలను ప్రజల వద్దకే తీసుకెళ్లేందు కు.. ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భవ' పేరుతో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 13న దిల్లీలో ప్రారంభించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు రెండు వారాల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. నిజామాబాద్ జిల్లాలో 22 పీహెచ్‌సీలు, 12 సీహెచ్‌సీలు, 10 యూపీహెచ్‌సీలు, కామారెడ్డి పరిధిలో 22 పీహెచ్‌సీ లు, 10 సీహెచ్‌సీలు, 2 యూపీహెచ్‌సీలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న ప్రతి గ్రామంలో గ్రామ సభ తరహాలో అవగాహన సదస్సులు, ఆరోగ్య శిబిరాల ఏర్పాటుకు ఆరోగ్యశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

**ప్రత్యేక వైద్యనిపుణులతో పరీక్షలు**

ఆయుష్మాన్ భవ ద్వారా అన్ని గ్రామాలు, పట్టణాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు చేయిస్తున్నారు. ఎలాంటి వ్యాధి ఉన్నట్లు నిర్ధరణ అయినా వారికి ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఉచితంగా చికిత్స, ఔషధాలు ఇచ్చే ఏర్పాట్లు చేశారు. వీటితో పాటు రక్తదాన శిబిరాలు, మానసిక వ్యాధులపై అవగాహన సదస్సులు, మాతాశిశు ఆరోగ్యంపై అవగాహన, క్షయ, కుష్ఠు వ్యాధులపై సదస్సులు ఇలా ప్రతి రోజు ఒక్కో కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు.

గ్రామ సభలు...ప్రతి పల్లెలో గ్రామసభ ఏర్పాటు చేసినట్లే ఆయుష్మాన్ సభ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలపై ప్రజలకు వివరిస్తారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సౌకర్యాలు, అందిస్తున్న వైద్యసేవల గురించి తెలియజేస్తున్నారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు ఏయే తేదీల్లో ఉంటాయో ముందుగానే దండోరా వేయించే ఏర్పాట్లు వైద్య ఆరోగ్యశాఖ చేసింది. శిబిరాలకు హాజరయ్యే వారికి అవరమైతే 134 రక్త పరీక్షలు చేసే అవకాశం ఉంది.రక్త, అవయవ దానం...ప్రధానంగా రక్త, అవయవ దానంపై అవగాహన కల్పించనున్నారు. రెండు రోజుల క్రితం ఆర్మూర్‌లో వరుణ్ మోటార్స్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. డిచ్‌పల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. అవయవ దానం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఒకరి అవయవాలు మరొకరికి ఎలా పనికొస్తాయో? ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో వివరించనున్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి- సుదర్శనం, నిజామాబాద్ జిల్లా వైద్యాధికారి


అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రజలు, తండా వాసులు సద్వినియోగం చేసుకోవాలి. శిబిరాలకు ప్రత్యేక వైద్య నిపుణులు హాజరవుతారు. ప్రతి ఒక్కరు ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలి.

# కబ్జాదారులపై పోలీసుల ఉక్కు పాదం

వరంగల్ : వరంగల్ మహానగరం స్మార్ట్ సిటీగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ క్రమంలో భూములకు రెక్కలు వచ్చాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు భూకబ్జాదారులు వాలిపోతున్నారు. చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకోవడం, అవసరమైతే నకిలీ పత్రాలు సృష్టించి భూవివాదాలకు తెరతీస్తున్నారు. నిజమైన యజమానులను భయపెడుతూ తమ పనికానిచ్చేస్తున్న సంఘటనలు ఇటీవల కాలంలో నగరంలో చాలా వెలుగు చూశాయి. భూ సమస్యలపై వరంగల్ పోలీసు కమిషనర్ రంగనాథ్‌కు సుమారు 4 వేల ఫిర్యాదులు అందాయి. ప్రాధాన్యత క్రమంలో సీపీ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు పరిష్కరిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 1,800 దరఖాస్తులను పరిష్కరించడం విశేషం.

ప్రత్యేక చొరవ : సామాన్యులు పైసాపైసా కూడబెట్టుకొని భూమిని కొనుగోలు చేసి, ఆపై కష్టపడి డబ్బులు సంపాదించి ఇంటి నిర్మాణం చేసుకునే సమయంలో ఆక్రమణదారులు రంగ ప్రవేశం చేస్తున్నారు. గతంలో ఠాణాలో ఫిర్యాదు చేస్తే సివిల్ వివాదమని ఎవరూ పెద్దగా పట్టించుకునే వారు కాదు. కానీ సీపీగా రంగనాథ్ వచ్చాక భూకబ్జాలపై ఉక్కుపాదం మోపారు. ప్రామాణిక కార్యాచరణ విధానం(ఎస్‌వోపీ) అవలంభిస్తూ విచారణ చేపడుతున్నారు. సమస్యలు పరిష్కారమవుతుండటంతో పోలీసు గ్రీవెన్స్‌సెల్‌కు ఫిర్యాదుదారుల సంఖ్య పెరిగింది. సీపీ ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. భూకబ్జాలకు పాల్పడిన వారిని చట్ట ప్రకారం నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులను నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో విచారణ: వివాదాలను పరిష్కరించే సమయంలో ఇరు వర్గాలకు చెందిన పత్రాలను పరిశీలిస్తున్నారు. అవసరాన్నిబట్టి భూమి ఉన్న ప్రదేశాన్ని ఇన్‌స్పెక్టర్ నుంచి డీసీపీ స్థాయి అధికారి వరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. భూమి కొనుగోలు ఒప్పంద సమయం నుంచి రిజిస్ట్రేషన్ వరకు ఇరు వర్గాలు జరిపిన బ్యాంక్ ఖాతాల వివరాలు సేకరిస్తున్నారు. ఖాతాలోకి డబ్బులు బదిలీ చేసిన మొత్తానికి,



భూమి విలువను పరిశీలిస్తున్నారు. తేడాలుంటే మరింత లోతుగా విచారిస్తున్నారు. పత్రాలు, సర్వే నెంబర్లు, ప్రస్తుతం కబ్జాలో ఎవరు ఉన్నారు..? ఎంతకాలం నుంచి వీరు ఉంటున్నారు...తదితర విషయాలపై దర్యాప్తు చేసి సీపీకి నివేదిక ఇస్తున్నారు. పత్రాలపై ఏదైనా అనుమానం వస్తే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడుతున్నారు. భూమి హక్కు పత్రాలు ఎవరికి సరిగ్గా ఉంటే వారికి పోలీసులు న్యాయం చేస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో 48 మంది పదే పదే భూకబ్జాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఇందులో కొందరిపై రౌడీషీట్ తెరిచారు. నలుగురిపై పీడీ యాక్టు అమలు చేశారు. వీరికి ఎవరు సహకరించారనే కోణంలోనూ విచారణ చేస్తున్నారు. అనుమానితులను పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

ఇటీవల నమోదైన కేసుల వివరాలు

హనుమకొండ ఠాణా పరిధిలోని కాకతీయకాలనీలో భూవివాదంలో జోక్యం చేసుకొని ఆ స్థలాన్ని విక్రయించాలని ఎదుటి వ్యక్తిపై ఒత్తిడి తెచ్చిన ప్రజాప్రతినిధిపై కేసు నమోదు చేసి జైలుకు తరలించారు.

మడికొండలో జోక్యం చేసుకున్న ప్రజాప్రతినిధితో పాటు కొంత మందిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కేయూ ఠాణా పరిధిలోని భూములకు నకిలీ పత్రాలు సృష్టించి క్రయవిక్రయాలు జరిపిన ముఠా సభ్యులను పట్టుకున్నారు. వారి నుంచి నకిలీ పత్రాలు, కంప్యూటర్, ప్రింటర్ తదితర సామగ్రిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

చట్టం పరిధిలో పరిష్కారం – ఏవీ రంగనాథ్, సీపీ

భూవివాదాలను చట్టం పరిధిలో పరిష్కరిస్తున్నాం. ఎస్‌వోపీ అనుసరిస్తూ ముందుకెళ్తున్నాం. ఇరువర్గాల పత్రాలు, క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజమైన యజమానికి న్యాయం చేస్తున్నాం.

# ధాన్యం కొనుగోలుకు బయోమెట్రిక్

కామారెడ్డి : ధాన్యం కొనుగోలుకు కొత్త విధానం అమలు చేయనున్నా రు. వచ్చే వానాకాలం సీజన్ నుంచి రైతుల నుంచి బయోమెట్రిక్ లేదా ఐరిస్ సేకరించిన తర్వాతే ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కామారెడ్డి జిల్లాలో అన్ని కొనుగోలు కేంద్రాలకు బయోమెట్రిక్ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశాలు వెలువడ్డాయి. జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 350 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి 6.50 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించా లనే లక్ష్యంతో అధికారులు ఇదివరకే ప్రణాళికలు రూపొందించుకున్నారు.

సేకరణ పక్కాగా చేపట్టడానికే..ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే బయోమెట్రిక్ విధానం తెరపైకి తీసుకువచ్చింది. కొనుగోళ్లలో జరిగే అక్రమాలకు ముకుతాడు వేయాలనే ఉద్దేశంతో కొత్త విధానానికి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. జిల్లాలోనూ గతంలో కొన్ని అవకతవకలు జరిగినట్లు రైతులు ఆరోపించారు. కొన్ని కేంద్రాల్లో బోగస్ రైతుల పేరిట ధాన్యం విక్రయించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. మరి కొన్ని కేంద్రాల్లో రైతుల నుంచి అధికంగా తూకంవేశారు. ఎక్కువైన తుకాన్ని బోగస్ రైతుల పేరుతో విక్రయించిన ఘటనలు వెలుగుచూశాయి. మరికొన్నిచోట్ల కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై మిల్లుకు చేరిన ధాన్యాన్ని తిరిగి కేంద్రానికి తీసుకువచ్చినట్లు ఆరోపణలు గుప్పుమన్నాయి. ప్రస్తుత బయోమెట్రిక్ ఆధారిత కొనుగోళ్ల విధానంతో బోగస్ రైతుల పేర్లపై ధాన్యం విక్రయించే అవకాశం ఉండదు. ప్రతి రైతు బయోమెట్రిక్ వేలిముద్రలు లేదా ఐరిస్ ఇచ్చిన తర్వాతే ధాన్యాన్ని తూకం వేస్తారు. వివరాలను వెంటనే ఆన్‌లైన్ చేయనున్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం చుడుతుండడంతో ఆధార్‌కార్డులు లేని రైతులు వెంటనే ఆధార్ నమోదు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# ట్రాఫిక్ నియమాలు తెలుసుకుందాం!



ఖమ్మం : ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు. నిత్యం జరుగుతున్న ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొందరు అంగవైకల్యం పాలవుతున్నారు. ప్రమాదాలను నివారించి ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ఖమ్మం జిల్లా కేంద్రంలో 'ట్రాఫిక్ శిక్షణ కేంద్రం' ఏర్పాటు చేస్తున్నారు.

రెండున్నర ఎకరాల్లో...

నగరంలోని పోలీసు కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలో 'ట్రాఫిక్ శిక్షణ కేంద్రం' నిర్మిస్తున్నారు. పనులను సీపీ విష్ణు ఎస్.వారియర్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. సుమారు రెండున్నర ఎకరాల్లో శిక్షణ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ కేంద్రంలో భారీ నిర్మాణాలు లేకున్నా రహదారులు, రహదారులపై ఉండే గుర్తులు, సిగ్నల్స్ వంటి పలు నమూనాలను రూపొందిస్తున్నారు. దీన్ని సందర్శించిన వారికి రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తారు. రహదారులపై కనిపించే సింగిల్ లైను, డాటెడ్ లైన్, డబుల్ లైన్, జీబ్రా క్రాసింగ్, ముందు ఉండే వంతెనలు, ఆసుపత్రి, పాఠశాలలను, వాహనం వెళ్లాల్సిన వేగాన్ని సూచించే గుర్తులను చూపుతూ వివరిస్తారు. అలాగే మైనర్లు వాహనాలు నడపడం, ఇద్దరు ప్రయాణించే ద్విచక్ర వాహనంపై ముగ్గురు, నలుగురు, అంతకన్నా ఎక్కువ మంది ప్రయాణించడం, ర్యాష్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనం నడపడం, రాంగ్‌రూట్లో ప్రయాణిస్తే, కార్లలో సీటు బెల్టు పెట్టుకోక జరిగే అనర్థాలను, వాహనాల పార్కింగ్ చేయడం వంటి పలు అంశాలను వివరిస్తారు. నిబంధనలను ఉల్లంఘిస్తే మోటారు వాహన చట్టం-1988 ప్రకారం తీసుకునే కఠిన చర్యలపై అవగాహన కల్పిస్తారు. అలాగే వర్చువల్ విధానంలో డ్రైవింగ్ శిక్షణ పొందవచ్చు. ఇందుకోసం ఎమ్యులేటర్ ఏర్పాటు చేయనున్నారు.

విద్యార్థులకు...

కేంద్రంలో నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులతోపాటు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. పౌర బాధ్యతను పెద్దవారికన్నా యువత త్వరగా అవగాహన కల్పించుకుంటారని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. అందుకే నగరంతోపాటు, పరిసరాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను దీని సందర్శనకు తీసుకురావాలని భావిస్తున్నారు. అలాగే ఆయా పాఠశాలల్లో రహదారి భద్రత గురించి వివరించనున్నారు.

# సామర్థ్యాలు రాబట్టాల్సిందే..!



కొత్తగూడెం : జాతీయ సాధన సర్వే(న్యాస్) బృందాలు నవంబరు 3వ తేదీన ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకోడానికి రానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు కేజీబీవీల్లో 3, 6, 9వ తరగతి విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడానికి రాష్ట్రవ్యాప్తంగా కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (ఎస్ఈఏఎస్) ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రిలోని విద్యాలయాల్లో శనివారం నుంచి నమూనా పరీక్షలు మొదలు పెట్టారు. అక్టోబరు 2వ తేదీ వరకు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి(ఎస్ఈఆర్టీ) రూపొందించిన నమూన ప్రశ్నపత్రాలను జిల్లాకు పంపనున్నారు. గణితం, సామాన్య, సాంఘిక, పర్యావరణ విద్య (ఈవీఎస్) పరీక్షల నిర్వహణకు కాల పట్టిక సైతం విడుదల చేశారు.

ప్రారంభమైన పరీక్షలు..'న్యాస్' బృందాలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఎంపిక చేసిన తరగతులకు చెందిన పిల్లల అభ్యసన సామర్థ్యాలను మాత్రమే పరీక్షిస్తారు. దీన్ని దృష్టిలో పెట్టుకొన్ని రాష్ట్ర విద్యాశాఖ అన్ని పాఠశాలల్లో ముందస్తు ప్రణాళిక ప్రకారం విద్యార్థులను సిద్ధం చేస్తోంది. ఈ నెల 23, 27, అక్టోబరు 3, 27, 31, నవంబరు 2, నవంబరు 3న చివరి నమూనా పరీక్ష నిర్వహించనున్నారు. 40, 60 మార్కులతో ఈ పరీక్షలు జరుపుతున్నారు. ఫలితాల ఆధారంగా సబ్జెక్టు ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దానున్నారు. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. 'న్యాస్' పరీక్షకు పూర్తిస్థాయి సన్నద్ధం అయ్యేలా డీఈఓ కార్యాలయాల అకాడమిక్ మానిటరింగ్ అధికారులు(ఏఓంఓలు) పర్యవేక్షిస్తున్నారు.

3, 6, 9వ తరగతి విద్యార్థులకు 'న్యాస్' పరీక్షలపై అవగాహనకు నమూనా పరీక్షలు కొనసాగిస్తున్నాం. ఇది రాష్ట్రవ్యాప్తంగా షెడ్యూల్ ప్రకారం జరుగుతుంది. పిల్లల్లో సబ్జెక్టులపై అవగాహన కలిగేందుకు, అసలు పరీక్షలో ప్రతిభ చూపేందుకు కార్యక్రమం ఉపయోగపడుతుంది. వెంకటేశ్వరాచారి, డీఈఓ, భద్రాద్రి

# ఆరాటమే.. పోరాటమేది?

కోల్‌బెల్ట్: సింగరేణి కార్మిక సంఘాలు తమ ఉనికి కోసం ఆరాటపడుతున్నాయి. కార్మికుల సమస్యలను నోటిమాటగా ప్రస్తావిస్తున్నాయి. పైపై మాటలతో పట్టు కోసం ప్రయత్నిస్తున్నాయి. కానీ, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను గాలికి వదిలేస్తున్నాయి. కనీసం ఒప్పందం జరిగిన అంశాలను కూడా అమలు చేయించలేకపోతున్న సంఘాల తీరుతో కార్మికుల్లో చులకన భావన కలుగుతోంది. జేబీసీసీఐ పరిధిలో అన్ని హక్కులు, ప్రయోజనాలు అమలవుతున్నా సింగరేణిలో మాత్రం కొన్నింటిని వర్తింపజేయడం లేదు. దీనిపై నిలదీసి అమలు చేయించాల్సిన సంఘాల ఉదాసీనత కార్మికుల్లో అసంతృప్తి కలిగిస్తోంది.

గ్రాట్యుటీపై రాని స్పష్టత

గ్రాట్యుటీని పెంచుతూ నిర్ణయం తీసుకున్నప్పటికీ ప్రభుత్వం విడుదల చేసిన జీవో సమయం నుంచి అమలు కావాలన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. రూ.10 లక్షలు ఉన్న గ్రాట్యుటీని రూ.20 లక్షలకు పెంచారు. దీన్ని 2017 ఫిబ్రవరి నుంచి అమలు చేస్తున్నారు. కార్మికులకు 2016 జనవరి నుంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో జేబీసీసీఐ స్టాండరైజేషన్ కమిటీ సమావేశంలో ఆమోదం లభించింది. కానీ, అమలు చేయించేందుకు నాయకత్వం పట్టుపట్టడం లేదు. 2016 జనవరిలో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు రూ.20 లక్షలు వర్తింపజేయాలి.. ఏడాది కాలం నష్టపోతుండటంతో సుమారు 3000 మంది విశ్రాంత ఉద్యోగులకు రూ.20 లక్షల గ్రాట్యుటీ వర్తించకుండా పోయింది. దీనిపై సరైన కార్యాచరణ.. యాజమాన్యాలపై ఒత్తిడి తేవాల్సిన సంఘాలు మొక్కుబడి తీరుతో అమలుకు నోచుకోవడం లేదు.

24 ఏళ్లుగా ఒకేరకమైన పింఛను

బొగ్గు గని కార్మికుల పింఛను 24 ఏళ్లుగా ఎలాంటి సవరణ లేకుండా ఒకేలా అమలవుతోంది. 1998లో పింఛను పథకం అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ప్రతి మూడేళ్లకోసారి సవరించుకోవాలన్న అంగీకారం ఉంది. కానీ ఇప్పటివరకు ఒక్కసారి కూడా పింఛను సవరించలేదు. దీంతో చాలా మంది విశ్రాంత కార్మికులకు కేవలం రూ.300 పింఛను వస్తోంది. దీనిపై విశ్రాంత కార్మికులు ఆందోళన చేస్తున్నారు. సీఎంపీఎఫ్ ట్రస్టు బోర్డులో నిలదీసి పింఛను పథకం సవరించేందుకు కార్మిక సంఘాలు పట్టుబట్టడం



లేదు.

ప్రయోజనాలపై పన్ను భారం

కార్మికులకు చెల్లించే వివిధ ప్రయోజనాలపై ఆదాయపు పన్ను చెల్లించాల్సిన యాజమాన్యం పట్టించుకోవడం లేదు. కోల్‌ఇండియాలో 2013 జనవరి 1 నుంచి అమలవుతోంది. సింగరేణిలో స్థానికంగా అమలు చేయించుకోవాల్సిన కార్మిక సంఘాలు కేవలం మాటలతోనే సరిపెడుతున్నాయి. గుర్తింపు సంఘం యాజమాన్యంతో చర్చించి అమలు చేయించలేకపోయింది. ఒక్కో కార్మికునికి రూ.25 వేల నుంచి రూ.60 వేల వరకు ఆదాయపు పన్ను భారం పడుతోంది. దీన్ని అమలు చేయించాల్సిన కార్మిక సంఘాలు ప్రకటనలకే పరిమితమయ్యాయి.

దీర్ఘకాలిక సమస్యలివీ..

సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. సొంతింటి కల నెరవేరడం లేదు. ఇల్లు నిర్మించుకోవడానికి స్థలం కేటాయించాలన్న డిమాండ్ అమలుకు నోచుకోవడం లేదు. గనులపై అధికారుల వేధింపులు, పని స్థలాల్లో రక్షణ చర్యలపై నిర్లక్ష్యం.. కనీసం పరికరాలు కూడా సక్రమంగా సరఫరా చేయని తీరు.. బినామీ పేర్ల మార్పు చేయాలన్న ఒప్పందాన్ని అమలు చేయించలేని నిస్సహాయ స్థితి.. అనేక సమస్యలు కార్మికులను చుట్టిముట్టి వేధిస్తున్నా పరిష్కారానికి చిత్తశుద్ధితో చొరవ చూపని సంఘాలు పట్టు కోసం మాత్రం కార్యాచరణ రూపొందించుకుంటున్నాయి.

# పోస్టులు తక్కువ.. పోటీ ఎక్కువ

కరీంనగర్ : ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి జిల్లాల వారీగా పోస్టుల సంఖ్యను రాష్ట్ర విద్యా శాఖ ప్రకటించింది. ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్టీ)కి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో సన్నద్ధమవుతున్నారు. వారందరూ దరఖాస్తు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈసారి కొత్తగా రోస్టర్ పాయింట్ల ఆధారంగా పోస్టుల వారీగా రిజర్వేషన్లను కూడా విద్యా శాఖ వెల్లడించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో మొత్తం 393 పోస్టులు భర్తీ కానున్నా యి. వీటికి వేల సంఖ్యలో సిద్ధమవుతున్నారు. పోస్టులు తక్కువగా ఉండడంతో పోటీ తీవ్రంగా ఉంది.

జగిత్యాల జిల్లాలో 148..

జిల్లాలో మొత్తం పోస్టులు 148 భర్తీ చేయనున్నారు. రిజర్వేషన్ల వారీగా ఖాళీలను ప్రకటించారు. ఓసీ విభాగంలో 28 జనరల్, 31 మహిళలకు, ఎస్సీ విభాగంలో 10 జనరల్, 18 మహిళలు, ఎస్టీలో 4 జనరల్, 6 మహిళలు, బీసీ-ఏలో 2 జనరల్, 13 మహిళలు, బీసీ-బీలో 1 జనరల్, 4 మహిళలు, బీసీ-సీలో 7 జనరల్, బీసీ-డిలో 2 మహిళలు, బీసీ-ఈలో 2 మహిళలు, బధిరులలో 9 మహిళలు, ఈడబ్ల్యూఎస్‌లో 5 జనరల్, 2 మహిళలు, మాజీ సైనికుల కోటాలో 4 పోస్టులు కేటాయించారు. జిల్లాలో స్థానిక సంస్థల యాజమాన్యం పరిధిలో భర్తీ అయ్యే పోస్టులే ఎక్కువగా ఉన్నాయి. వీటిలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో బయోసైన్స్ 8, హిందీ 5, తెలుగు 6, భాషా పండితులు హిందీ 15, తెలుగు 17, ఎస్జీటీలు 30 పోస్టులున్నాయి. ఎస్జీటీ(ఉర్దూ) పోస్టులు స్థానిక సంస్థల యాజమాన్యం పరిధిలో 7, ప్రభుత్వ పాఠశాలల పరిధిలో 10 ఉన్నాయి. మిగిలిన విభాగాల పోస్టులు ఇంతకంటే తక్కువ ఉన్నాయి.

కరీంనగర్‌లో 99...

జిల్లాలో మొత్తం 99 పోస్టులు ఉన్నాయి. ఓసీ విభాగంలో 15 జనరల్, 22 మహిళలు, ఎస్సీలో 10 జనరల్, 13 మహిళలు, ఎస్టీలో 2 జనరల్, 4 మహిళలు, బీసీ-ఏలో 8, బీసీ-బీలో 4 మహిళలకు, బీసీ-సీలో 4 జనరల్, 1 మహిళ, బీసీ-డీలో 2 మహిళలు, బధిరుల విభాగంలో 6 మహిళలు, ఈడబ్ల్యూఎస్‌లో 4 జనరల్, 2 మహిళలు, మాజీ సైనికుల కోటాలో 2 పోస్టులను కేటాయించారు. జిల్లాలో స్థానిక సంస్థల యాజమాన్యం కింద స్కూల్ అసిస్టెంట్ విభాగంలో సోషల్‌స్టడీస్ 7, తెలుగు 4, భాషా పండితులు తెలుగు 11, పీఈటీ 4, ఎస్జీటీ 18 పోస్టులున్నాయి. ప్రభుత్వ యాజమాన్యం పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ తెలుగు 2, ఎస్జీటీలు 19, ఎస్జీటీ(ఉర్దూ)14, భాషా పండితులు హిందీ 3, తెలుగు 3 ఖాళీలున్నాయి. అన్ని యాజమాన్యాల పరిధిలో ప్రకటించిన మిగిలిన కేటగిరీల్లో 1, 2 పోస్టులున్నాయి.

పెద్దపల్లిలో 43...

జిల్లాలో మొత్తం 43 ఖాళీలున్నాయి. వాటిల్లో ఓసీ విభాగంలో 7 జనరల్, 16 మహిళలు, ఎస్సీలో 1 జనరల్, 8 మహిళలు, ఎస్టీలో 1 మహిళ, బీసీ-ఏలో 3, బీసీ-బీలో 1 మహిళలు, బీసీ-సీలో 1 జనరల్, 1 మహిళ, బధిరుల విభాగంలో 1 జనరల్, 1 మహిళ, ఈడబ్ల్యూఎస్‌లో 1 జనరల్, మాజీ సైనికుల కోటాలో 1 పోస్టును కేటాయించారు. జిల్లాలో స్థానిక సంస్థల యాజమాన్యం పరిధిలోని పాఠశాలల్లోనే ప్రకటించిన ఖాళీలో అధికంగా పోస్టులు భర్తీ కానున్నాయి. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో హిందీ 4, పీడీ 2, సాంఘికశాస్త్రం 14, తెలుగు 4, భాషా పండితులు హిందీలో 2, తెలుగులో 3, ఎస్జీటీలు 5, ఎస్జీటీ(ఉర్దూ) 2 పోస్టులు కేటాయించగా, ప్రకటించిన పోస్టుల్లో మిగిలిన విభాగాల్లో ఒక్కోటి భర్తీ చేస్తున్నారు.

రాజన్న సిరిసిల్లలో 103..

జిల్లాలో మొత్తం 103 పోస్టులు భర్తీ చేస్తున్నారు. వీటిలో ఓసీ విభాగంలో 20 జనరల్, 20 మహిళలు, ఎస్సీలో జనరల్ 6, మహిళలు 12, ఎస్టీలో 4 జనరల్, 3 మహిళలు, బీసీ-ఏలో 3 జనరల్, 6 మహిళలు, బీసీ-బీలో 3 జనరల్, 3 మహిళలు, బీసీ-సీలో 1 జనరల్, 2 మహిళలు, బీసీ-డీలో 2 జనరల్, 1 మహిళ, బీసీ-ఈలో 1 జనరల్, 1 మహిళ, వికలాంగుల విభాగంలో 2 జనరల్, 3 మహిళలు, స్పోర్ట్స్ కోటాలో 1 జనరల్, మాజీ సైనికుల కోటాలో 2 పోస్టులను కేటాయించారు. జిల్లాలో స్థానిక సంస్థల యాజమాన్యం పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ విభాగంలో సాంఘికశాస్త్రం 10, భాషా పండితులు హిందీ 6, తెలుగు 6, పీఈటీలు 4, ఎస్జీటీలు 61 పోస్టులున్నాయి. ప్రకటించిన మిగిలిన విభాగాల్లో పోస్టులు ఇంత కంటే తక్కువ సంఖ్యలో ఉన్నాయి.

# నీలగిరిలో అక్రమ పునాదులు

నల్గొండ : పట్టణంలో 565 జాతీయ రహదారి పక్కనే ప్రైవేటు ఆస్పత్రి సమీపంలో ఓ వ్యాపారి ఎలాంటి అనుమతి లేకుండానే నిర్మాణం చేపట్టారు. దీనిపై స్థానికులు చేసిన ఫిర్యాదుపై పుర అధికారులు నోటీసులిచ్చి చేతులు దులుపుకొన్నారు. ఓ ప్రజాప్రతినిధి ఆదేశాల మేరకు అధికారులు అటువైపు చూసే ప్రయత్నం చేయడం లేదని ప్రచారం సాగుతోంది.

నల్గొండ నుంచి దేవరకొండ వెళ్లే మార్గంలో శివాంజనేయ ఫంక్షన్‌హాల్ పక్కన పాతవెంచరులో ఓ ప్లాటు యజమాని తన ప్లాటు వెనుక భాగంలో ఉన్న రోడ్డు స్థలాన్ని కొంత వరకు కలుపుకొని ప్రభుత్వ అనుమతి లేకుండా రెండు అంతస్తుల వాణిజ్య భవనం నిర్మిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రాసుపత్రి పక్క రోడ్డు నుంచి పద్మావతి కాలనీ వెళ్లే మార్గంలో అనుమతికి మించి బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. పుర అధికారులకు విషయం తెలిసి నోటీసులు జారీ చేశారు. భవన నిర్మాణదారుడు ఓ మంత్రి పేషీ నుంచి పుర అధికారులకు ఫోన్ చేయించడంతో అటువైపు వారు వెళ్లడం లేదని సమాచారం.

దేవరకొండ రోడ్డు సిద్ధార్థ కాలనీ వెళ్లే క్రాస్ రోడ్డులో అనుమతి లేకుండా సెల్లార్ నిర్మాణం చేపట్టారు. అదే విధంగా హైదరాబాద్ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహం నుంచి చింతల పార్కు వెళ్లే మూల పక్కనే ప్రభుత్వ నిబంధనలు కాలరాసి అనుమతులు లేకుండా సెల్లార్ నిర్మాణం చేపడుతున్నారు. ఇలా ఒకటీ రెండు కాదు నల్గొండ పట్టణంలో పెద్దసంఖ్యలో అక్రమ పునాదులు వెలుస్తున్నాయి. నీలగిరి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడటం లేదు. అనుమతులు లేకుండానే అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నా.. ఇక్కడ అంతా ప్రేక్షకుల్లానే మిగిలిపోయారు. అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఇళ్లు, భవన నిర్మాణాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం టీఎస్-బీపాస్ తెరమీదకు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ప్రత్యేకంగా పురపాలికల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసినా నీలగిరిలో అక్రమ పునాదులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇష్టారీతిన అనధికారిక నిర్మాణాలు జరుగుతున్నా టాస్క్‌ఫోర్స్ కమిటీ, పుర, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. అనుమతులు పరిశీలించి రావడం తప్ప, ఇంటి నిర్మాణాలు ఎలా చేస్తున్నారనే విషయాన్ని పట్టించుకోవడం లేదు. దస్త్రాలు సక్రమంగా లేకపోవడంతో అనుమతులు ఇవ్వకుండా పుర అధికారులు తిరస్కరించినా కొందరు అనుమతులు ఉన్నాయంటూ యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగిస్తూనే ఉన్నారు. ఒకటీ రెండు అంతస్తులకు అనుమతులు తీసుకుని మరి కొందరు నాలుగు, అయిదు అంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నా ప్రశ్నించేవారే కరవయ్యారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఫిర్యాదులు చేస్తే అధికారులు తనిఖీకి వచ్చేలోపు రాత్రి, పగలు నిర్మాణాలు చేపడుతూ పనులన్నీ పూర్తి చేస్తున్నారు. పునాది దశలోనే రాజకీయ నాయకుల ద్వారా అది మనోళ్లదే.. దాని జోలికి వెళ్లొద్దన్న ఆదేశాలిస్తున్నారు. దీంతో నియంత్రించాల్సిన సంబంధిత అధికార యంత్రాంగానికి ఇబ్బందికరంగా మారడంతో అటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపణలున్నాయి. దీంతో అక్రమ నిర్మాణాల ద్వారా ఏటా పురపాలికకు రావాల్సిన రూ.కోట్ల ఆదాయం గండి పడుతోంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాంరమణాచారి, కమిషనర్, నల్గొండ పురపాలికఅనుమతి లేని నిర్మాణాలు, అదనపు నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం.




మధ్యప్రదేశ్‌లో ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఈ ఏడాది చివరిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతిపక్ష కాంగ్రెస్‌ను దీటుగా ఎదుర్కొనేందుకు భాజపా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే రెండు విడతల్లో ఇప్పటికే 78 మంది అభ్యర్థులను ప్రకటించింది. జాతీయ స్థాయి నాయకులను కూడా రంగంలోకి దించుతోంది. ముగ్గురు కేంద్ర మంత్రులకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించిందంటే వ్యూహాన్ని ఎంత పకడ్బందీగా అమలు చేస్తోందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అయితే, ఇప్పటి వరకు విడుదల చేసిన రెండు జాబితాల్లోనూ ముఖ్యమంత్రి, అందరూ ముద్దుగా 'మామ' అని పిలుచుకునే శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. రాబోయే ఎన్నికలకు ఆయన దూరంగా ఉంటారన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. ఇందులో నిజమెంత?


**ఇది హెచ్చరికేనా? :** ముఖ్యమంత్రిగా శివరాజ్ సింగ్ చౌహాన్ సుదీర్ఘ కాలంపాటు సేవలందించారు. రాజకీయంగా అపార అనుభవం ఉంది. అలాంటి వ్యక్తి పేరు తొలి రెండు జాబితాల్లో లేకపోవడం కచ్చితంగా ఆలోచించాల్సిన విషయమే. దీనికి తోడు కేంద్రమంత్రులను బరిలోకి దించడం, చౌహాన్ రాజకీయ భవిష్యత్‌పై ప్రశ్నలు సంధిస్తోంది. భాజపా అధిష్ఠానం తాజాగా తీసుకుంటున్న నిర్ణయాలు చౌహాన్‌కు హెచ్చరికగా కొందరు భావిస్తున్నారు. ఒకవేళ త్వరలో విడుదల చేయబోయే అభ్యర్థుల జాబితాల్లో శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు ఉన్నా.. ఆయన ముఖ్యమంత్రి రేసులో ఉండకపోవచ్చని పార్టీలోని కొన్ని వర్గాలు చెబుతున్నాయి. ఆయన స్థానాన్ని భర్తీ చేసేందుకే కీలక నేతలను బరిలో దించుతున్నట్లు సమాచారం.

**భాజపా వ్యూహమే! :** పార్టీలోని మరికొన్ని వర్గాలు మాత్రం శివరాజ్ సింగ్ చౌహాన్‌ను టికెట్ కేటాయించబోరన్న వాదనను ఖండిస్తున్నాయి. కాంగ్రెస్‌ను ఎదుర్కొనే వ్యూహంలో భాగంగానే జాతీయ స్థాయి నాయకులను భాజపా అసెంబ్లీ బరిలో దించుతోందని చెబుతున్నారు. భాజపా తాజాగా విడుదల చేసిన జాబితాలో కేంద్ర మంత్రులు నరేంద్రసింగ్ తోమర్, ప్రహ్లాద్ పటేల్, ఫగ్గన్‌సింగ్ కులస్థేల పేర్లను ఖరారు చేసింది. ఇప్పటి వరకు విడుదల చేసిన జాబితాలో ఒక్క సిట్టింగ్ మంత్రి పేరు కూడా లేకపోవడం గమనార్హం. అభ్యర్థుల విషయంలో బంధుప్రీతిని అరికట్టాలన్న ఉద్దేశంతోనే భాజపా అధిష్ఠానం ఈ తరహా చర్యలు తీసుకుంటోందన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. పార్టీ హైకమాండ్ ఎదుట ప్రజల్లో తమకున్న బలాన్ని నిరూపించిన వారికే టిక్కెట్లు కేటాయించాలని అధిష్ఠానం యోచిస్తున్నట్లు సమాచారం.

**'ఇండియా'ను ఎదుర్కొనేందుకే! :** కేంద్రంలో భాజపాను గద్దె దించేందుకు ఏర్పాటైన 'ఇండియా' కూటమి.. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ కలిసే పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పార్టీలను సమర్థంగా ఎదుర్కొనేందుకు సత్తా ఉన్న నాయకులను ఏరికోరి మరీ అధిష్ఠానం బరిలోకి దించుతోంది. ఇదే వ్యూహాన్ని త్వరలో ఎన్నికలు జరగనున్న బెంగాల్, పంజాబ్, కేరళలోనూ అమలు చేసే అవకాశం ఉంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు జరుగుతున్న ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న భాజపా.. అభ్యర్థుల విషయంలో అచితూచి అడుగులు వేస్తోంది. మధ్యప్రదేశ్‌లో మొత్తం 230 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. గత నెలలోనే 39మందితో తొలి జాబితాను ప్రకటించిన భాజపా అధిష్ఠానం.. మంగళవారం మరో 39 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది.

**భాజపా ఓటమిని అంగీకరించినట్టే: కాంగ్రెస్ :** మధ్యప్రదేశ్ ఎన్నికల బరిలో భాజపా కేంద్ర మంత్రుల్ని దించుతుండటంపై ప్రతిపక్ష కాంగ్రెస్ స్పందించింది. కమలం పార్టీ ఓటమిని అంగీకరించిందని వ్యాఖ్యానించింది. ఓడిపోతామన్న భయంతోనే జాతీయస్థాయి నాయకుల్ని ఎమ్మెల్యే అభ్యర్థులుగా నిలబెడుతోందని విమర్శించింది. 2018 మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ .. కమల్‌నాథ్ ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. పార్టీలో ఏర్పడిన అంతర్గత విభేదాల కారణంగా సీనియర్ నేత జ్యోతిరాదిత్య సింధియాతోపాటు 24 మంది ఎమ్మెల్యేలు భాజపా గూటికి చేరిపోయారు. దీంతో 2020లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయింది. శివరాజ్ సింగ్ చౌహాన్ సీఎంగా భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పూర్వ వైభవాన్ని పొందాలని కాంగ్రెస్, అధికారాన్ని నిలబెట్టుకోవాలని భాజపా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో రాజకీయంగా ఇరువర్గాల్లో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు.

## వచ్చే ఎన్నికల్లో చంద్రసేనకు 160 సీట్లు ఖాయం: అశ్వనీదత్



రాజమహేంద్రవరం: వచ్చే ఎన్నికల్లో తెదేపా-జనసేన 160 సీట్లు సాధిస్తాయని ప్రముఖ సినీ నిర్మాత అశ్వనీదత్ ధీమా వ్యక్తం చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో భువనేశ్వరి, బ్రాహ్మణిని కలిసి సంఘీభావం తెలిపిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు లాంటి మహానాయకుడిని జైల్లో పెట్టడం దుర్మార్గమన్నారు. మహా నాయకుడిని జైల్లో పెడతారని ఎవరైనా ఊహిస్తారా? అని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రసేన సుస్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు.

## 29 నుంచి లోకేశ్ పాదయాత్ర తిరిగి ప్రారంభం



అమరావతి: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సెప్టెంబరు 29న రాత్రి 8.15 గంటలకు తిరిగి ప్రారంభం కానుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజోలు నియోజకవర్గంలో పాదయాత్ర ఆగిన చోట నుంచే తిరిగి ప్రారంభించాలని లోకేశ్ నిర్ణయించారు. చంద్రబాబు అరెస్టు, అనంతర పరిణామాల నేపథ్యంలో ఈనెల 9వ తేదీ ఉదయం పాదయాత్ర నిలిపివేసిన విషయం తెలిసిందే. దాదాపు 20 రోజుల తర్వాత లోకేశ్ పాదయాత్రకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన తెదేపా పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశంలో అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, నక్కా ఆనందబాబు, టీడీ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. దిల్లీ నుంచి లోకేశ్ వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. జనసేనతో పొత్తు నేపథ్యంలో ఎలా సమన్వయం చేసుకోవాలనే దానిపై సమాలోచనలు జరిపారు.

ఇరు పార్టీలతో కలిపి జేఏసీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు అచ్చెన్నాయుడు తెలిపారు.




సింగపూర్ : సింగపూర్‌లోని ఓ నిర్మాణ స్థలంలో బయటపడిన 100 కేజీల బాంబును ఆ దేశ ఆర్మీ నిపుణులు పేల్చివేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వీడియోను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. సింగపూర్‌లోని బకిట్ టిమా శివారులోని ఓ నిర్మాణ స్థలంలో బాంబు కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆర్మీ సాయం తీసుకొని అది రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటిదని తేల్చారు. బాంబును వేరొక చోటుకు తరలించడం సాధ్యం కాదని గుర్తించి చివరకు దాన్ని అక్కడే పేల్చివేయాలనే నిర్ణయానికి వచ్చారు. అందుకోసం చుట్టుపక్కల నివాసం ఉంటున్న 4వేల మందిని ఖాళీ చేయించారు. బాంబు పేలుడు వినిపించే అవకాశం ఉన్నందున ప్రజలెవరూ భయపడాల్సిన పని లేదని ముందే ప్రకటన జారీ చేశారు. బాంబు పేల్చినా ఎలాంటి నష్టం వాటిల్లకుండా సింగపూర్ ఆర్మీ అధికారులు కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకున్నారు. సుమారు 40 మంది భద్రతా సిబ్బంది ఇసుక సంచులతో పేలుడు పరికరాన్ని కప్పేశారు. ఆ తరువాత చుట్టూ కాంక్రీటు బ్లాకులను అమర్చారు. ముందుగా నిర్దేశించుకున్న సమయం ప్రకారం బాంబును బ్లాస్ట్ చేశారు. దాంతో భారీ శబ్దం వినిపించింది. పేలుడు తరువాత ఆ ప్రాంతం సురక్షితమని నిర్ధారించుకున్న తరువాతే ప్రజలను తిరిగి తమ ఇళ్లలోకి అనుమతించారు. కాగా.. పేల్చివేసిన బాంబులో 47 కేజీల దాకా మందుగుండు ఉండొచ్చని ఓ మీడియా సంస్థ పేర్కొంది.

దాంతో చుట్టుపక్కల నిర్మాణాలన్నింటినీ పేల్చివేయొచ్చని తెలిపింది. సింగపూర్‌లో గతంలోనూ ఇలాంటి బాంబులు వెలుగు చూశాయి. జియాక్ కిమ్ స్ట్రీట్‌లో 50 కేజీల బాంబు, మండాయ్‌లో 100 కేజీల బాంబు బయటపడ్డాయి.




విజయవాడ: అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేరును సీఐడీ చేర్చింది. ఈ మేరకు కేసులో ఆయన పేరును చేరుస్తూ నేడు ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేసింది.

ఈ కేసులో లోకేశ్ పేరును చేర్చేందుకు ఉన్న ఆధారాలేంటి? ఏ కోణంలో చేర్చారు? తదితర విషయాలను సీఐడీ వెల్లడించాల్సి ఉంది. సీఐడీ మెమోపై న్యాయమూర్తి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఇదే కేసులో తెదేపా అధినేత చంద్రబాబు, మాజీ మంత్రి నారాయణ పేర్లను సీఐడీ చేర్చింది. నారాయణ ముందస్తు బెయిల్ పొందారు.

ఈ కేసులోనే చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఇవాళ మధ్యాహ్నం హైకోర్టులో విచారణ జరగనుంది.




కెనడాలో ఖలిస్థాన్ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసు దర్యాప్తులో సహకరించాలని భారత్‌ను ప్రైవేటుగా, బహిరంగంగా అభ్యర్థించామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ పేర్కొన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కచ్చితంగా జరగాలని.. దోషులకు శిక్షపడాలని ఆయన అభిప్రాయపడ్డారు. తన రోజువారీ మీడియా సమావేశంలో మిల్లర్ మాట్లాడుతూ.. "కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపణలతో మేము తీవ్రంగా కలత చెందాం. మా కెనడా భాగస్వాములతో టచ్‌లో ఉన్నాం. దోషులకు శిక్షపడేలా కెనడా దర్యాప్తు కొనసాగడం ముఖ్యమని మేము భావిస్తున్నాం. ఈ దర్యాప్తునకు సహకరించాలని మేము భారత్‌ను బహిరంగంగా.. ప్రేవేటుగా అభ్యర్థించాం" అని వెల్లడించారు. ఓ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు.

**దోషులను గుర్తించేందుకు దర్యాప్తు జరపాలి :** ఉగ్రవాది నిజ్జర్ హత్య కేసులో దోషులను గుర్తించేందుకు దర్యాప్తు జరపాల్సిందేనని కాలిఫోర్నియా ప్రతినిధుల సభ సభ్యుడు జిమ్ కోస్టా డిమాండ్ చేశారు. ఆయన ఎక్స్ (ట్విటర్)లో స్పందిస్తూ.. "నిజ్జర్ హత్య విషయంపై నేను చాలా ఆందోళన చెందాను. దీనిపై అధికారిక బ్రీఫింగ్ కావాలని హౌస్ ఫారెన్ అఫైర్స్ కమిటీ సభ్యుడిగా కోరాను. ఈ నేరంపై మనం కచ్చితంగా దర్యాప్తు చేపట్టి దోషులను బాధ్యులుగా చేయాలి" అని పేర్కొన్నారు.

**భారత్ కీలక భాగస్వామే.. కానీ..! :** మరోవైపు భారత్-కెనడా దౌత్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. కెనడా ప్రభుత్వ ప్రకటనలతో ఖలిస్థానీలు పేట్రేగి పోతున్నారు. తాజాగా కెనడాలోని భారత దౌత్య కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయాలని పిలుపునిచ్చారు. వీటికి 'సిఖ్స్ ఫర్ జస్టిస్' సంస్థ నేతృత్వం వహిస్తోంది. భారత దౌత్యవేత్తను బహిష్కరించాలని ఆ సంస్థ ప్రతినిధి జతిందర్ సింగ్ గ్రేవాల్ కెనడాను డిమాండ్ చేశారు. మరోవైపు భారత దౌత్యకార్యాలయాల వద్ద బందోబస్తు పెంచారు.

## ఎంపీ అంటే నో ...వైసీపీ టీడీపీ సేం టూ సేం



అమరావతి : ఎంపీ పదవి చాలా కీలకమైనది. దర్జాతో కూడుకున్నది. పార్లమెంట్ మెంబర్ అనిపించుకోవడం అంటే హోదా వేరొకటి లేదు. ఉత్తరాంధ్రాలో తీసుకుంటే అయిదు పార్లమెంట్ సీట్లు ఉన్నాయి. వీటిలో నాలుగింటిని వైసీపీ 2019 ఎన్నికల్లో గెలిచింది. శ్రీకాకుళం ఎంపీ సీటుని మాత్రం రెండవమారు కూడా గెలిచి కింజరాపు వారి వారసుడు రామ్మోహన్ నాయుడు నిలబెట్టుకున్నారు. ఇక 2024 ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. అయితే ఉత్తరాంధ్రాలో ప్రస్తుతం ఉన్న ఎంపీలలో తిరిగి మళ్లీ పోటీ చేసే వారు అయితే లేరు అనే అంటున్నారు. వైసీపీ విషయమే తీసుకుంటే కొందరిని మార్చేద్దామని చూస్తోంది. మరి కొందరిని కంటిన్యూ చేద్దామన్నా వారే వద్దు అని తప్పుకునేలా ఉన్నారట. ఆ జాబితాలో మొదట విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ గురించి చెప్పాలి. ఆయన 2019లోనే స్వల్ప ఆధిక్యతతో గెలిచారు. అది కూడా జనసేన మధ్యన ఉండబట్టి. లేకపోతే అద్భుతమైన మెజారిటీతో తెలుగుదేశం గెలిచేది. ఇక వచ్చే ఎన్నికల్లో వైసీపీకి వేవ్ ఎటూ ఉండదు ఎదురొడ్డి గెలవాలంటే సొంత ఇమేజ్ ఉండాలి. పైగా బాగా ఖర్చు పెట్టాలి. దాంతో నాకు ఒక అసెంబ్లీ సీటు ఇస్తే చాలు అని ఆయన అంటున్నారు. ఇక అనకాపల్లి ఎంపీ సత్యవతి విషయం కూడా అలాగే ఉంది.ఆమె కూడా పోటీకి నో చెప్పేస్తున్నారు. ఇస్తే గిస్తే అసెంబ్లీ ఇవ్వండి అంటున్నారు. అదీ లేకపోతే ఆమె రాజకీయలకు గుడ్ బై అంటున్నారు. ఇక అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని తీసుకుంటే ఆమె కూడా ఢిల్లీకి వెళ్లడానికి ససేమిరా అంటున్నట్లుగా భోగట్టా. రెండున్నర లక్షల ఓట్ల మెజారిటీతో ఆమె గెలిచారు. మరోసారి ఆమెకే టికెట్ ఇవ్వాలని అధినాయకత్వం భావిస్తున్నా అసెంబ్లీకి పోటీ చేస్తాను అని ఆమె చెబుతున్నారట. ఇస్తే పాడేరు కానీ లేకపోతే అరకు కానీ ఇవ్వాలని ఆమె అంటున్నట్లు చెబుతున్నారు. విజయనగరంలో చూస్తే బెల్లాన చంద్రశేఖర్ ఎంపీగా ఉన్నారు. ఆయన ఈసారి అసెంబ్లీ వైపే చూస్తున్నారు. ఆయన ఎచ్చెర్ల నియోజకవర్గం మీద కన్నేశారని అంటున్నారు. ఒకవేళ బొత్స వదిలేస్తే చీపురుపల్లి నుంచి పోటీకి తయారు అంటున్నారు. వైసీపీలో ఇలా పరిస్థితి ఉంటే తెలుగుదేశం నుంచి ఎంపీ అయిన రామ్మోహన్ కూడా ఎంపీ వద్దు అసెంబ్లీకే ఈసారి పోటీ చేస్తాను అని చంద్రబాబు వద్దనే విన్నపం చేసుకున్నారని టాక్ నడుస్తోంది. ఆయన నరసన్నపేట సీటుని కూడా సెలెక్ట్ చేసి పెట్టుకున్నారు.

దాంతో అటు జగన్ ఇటు చంద్రబాబులకు ఎంపీ సీట్లు అతి పెద్ద పరీక్ష కాబోతున్నాయని అంటున్నారు. ఎవరిని అడిగినా ఎంపీ ఎందుకు అసెంబ్లీకే అంటున్నారు. పూసపాటి అశోక్ గజపతిరాజు విజయనగరం ఎంపీగా మరోసారి పోటీకి విముఖంగా ఉన్నారు. ఆయన ఎమ్మెల్యే అయి పార్టీ గెలిస్తే మంత్రి కావాలని చూస్తున్నారు. అదే విధంగా వైసీపీ ఎంపీలూ ఉన్నారు. ఇక్కడ మరో విషయం కూడా ఉంది అంటున్నారు. ఈసారి వైసీపీ అయినా టీడీపీ అయినా ఎంపీ అభ్యర్థిగా ఉన్న వారు తమ పరిధిలోని అసెంబ్లీ అభ్యర్థులకు ఖర్చు పెట్టుకోవాల్సి ఉంటుంది. ఢీ అంటే ఢీ అనే 2024 ఎన్నికల్లో ఈ ఖర్చు తడిసి మోపెడు అవుతుందని ఇంత భారం తమకు ఎందుకు హాయిగా ఎమ్మెల్యేగా పోటీ చేస్తే పోలా అని ఆశావహులు కూడా ఆలోచిస్తున్నారుట. మరి ఎంపీ సీటుకు పోటే పడే బిగ్ షాట్స్ ఎవరు అన్నదే వైసీపీ టీడీపీ చేసే సెర్చింగ్ అంటున్నారు.

## ఉత్తరాంధ్ర వాసులకు గుడ్‌న్యూస్.. విశాఖ నుంచి నేరుగా వారణాసికి రైలు



ఉత్తరాంధ్ర వాసులకు రైల్వే శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. ఇకపై నేరుగా వారణాసికి వెళ్లేందుకు వీలుగా సంబల్‌పూర్ నుంచి బనారస్ మధ్య నడిచే (18311) ఎక్స్‌ప్రెస్ రైలును విశాఖ వరకు పొడిగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ విషయాన్ని ఎక్స్ (ట్విటర్) వేదికగా తెలియజేశారు. ఉత్తరాంధ్ర వాసుల కల నెరవేర్చినందుకు రైల్వే శాఖకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర వాసులు వారణాసి వెళ్లాలంటే విజయవాడ లేదా భువనేశ్వర్ వెళ్లి రైలు ఎక్కాల్సి ఉంటుంది. కాశీ విశ్వనాథుడిని దర్శించుకోవాలన్నా, కర్మకాండలకు సంబంధించిన కార్యక్రమాలకు హాజరవ్వాలన్నా ఎన్నో వ్యయప్రయాసలు కోర్చాల్సిన పరిస్థితి. దీంతో ఎన్నో ఏళ్లు నుంచి వారణాసికి రైలు నడపాలని ఉత్తరాంధ్ర వాసులు కోరుతున్నారు. తాను లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైనప్పటి నుంచి ఇదే విషయాన్ని పలుమార్లు పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తడంతో పాటు రైల్వే శాఖ దృష్టికి తీసుకెళ్లానని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఉత్తరాంధ్ర వాసుల వినతిని పరిగణనలోకి తీసుకున్న రైల్వే శాఖ రైలు పొడిగింపునకు ఆమోదం తెలిపిందని చెప్పారు. వారానికి రెండు రోజుల పాటు (బుధ, శని) ఒడిశాలోని సంబల్‌పూర్ నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు.. ఇకపై విశాఖ నుంచి త్వరలో అందుబాటులోకి రానుంది. విశాఖ, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, సంబల్‌పూర్ స్టేషన్ల మీదుగా వారణాసికి చేరుకోవచ్చు.




## చేతిలో వైన్ గ్లాస్ తో లహరి థైస్ షో



బిగ్ బాస్ రియాల్టీ షో మూలంగా చాలా మందికి గుర్తింపు వచ్చిందనే చెప్పాలి. అప్పటి వరకు ప్రేక్షకులకు పెద్దగా తెలియని వారికి, ఈ షో ద్వారా పాపులారిటీ వచ్చింది. అలా ఫేమ్ తెచ్చుకున్న వారిలో లహరి షరి కూడా ఒకరు. ఒకప్పుడు న్యూస్ యాంకర్ గా ఆమె కెరీర్ మొదలుపెట్టింది. ఇప్పుడు పలు సినిమాల్లో ముఖ్యమైన రోల్స్ అందుకుంటోంది. బిగ్ బాస్ సీజన్ 5లో అడుగుపెట్టిన ఈ బ్యూటీ, అక్కడ తన అందాలతో అందరినీ ఇంప్రెస్ చేసింది. ఆ తర్వాత పలు సినిమాల్లో చిన్న చిన్న రోల్స్ చేస్తోంది. కాగా, లహరి ది బ్లాక్ బాస్టర్ హిట్ అర్జున్ రెడ్డిలో నర్స్ పాత్రలో మెరిసింది. ఆ ఒక్క సీన్ తో ఎక్కువ ఫేమస్ అయ్యింది. అయితే, అంతకు ముందు ఆమె చాలా టీవీ షోలు కూడా చేసింది. కానీ, పెద్దగా ఎవరూ గుర్తించకపోవడం గమనార్హం. ఇక, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పటికప్పుడు అందాల ఆరబోత చేస్తూ సందడి చేస్తూ ఉంటుంది. ఎక్కువగా క్లీవేజ్ షో, స్కిన్ షో చేస్తూనే ఫోటో లకు ఫోజులు ఇస్తూ ఉంటుంది. ఇక, తాజాగా కూడా ఆమె తన సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలు షేర్ చేసింది. కాగా, అవి ప్రస్తుతం వైరల్ గా మారాయి. ఆ ఫోటోల్లో ఆమె కేవలం ఒక షర్ట్ ధరించింది. కింద ప్యాంట్ లేకపోవడంతో ఆమె థైస్ అందాలు స్పష్టంగా కనపడుతున్నాయి. ఒక, చేతిలో వైన్ గ్లాస్ పట్టుకొని ఉంది. ఆ వైన్ ని ఆస్వాదిస్తూ, ఆమె ఇచ్చిన ఫోటోలను చూస్తుంటే కుర్రాళ్లకు మత్తు ఎక్కేలా ఉండటం గమనార్హం. లహరి కి స్వతహాగా ట్రావెలింగ్ అంటే ఇష్టం. ఎప్పుడూ ఏదో ఒక ప్రదేశానికి వెళ్తూ ఉంటుంది. ఎక్కువగా సోలో ట్రిప్స్ ని ఇష్టపడుతుంది. కారులో లాంగ్ డ్రైవ్స్ కూడా వెళుతూ ఉంటుంది. కాగా, ఈ సారి క్రూయిజ్ షిప్ లో ఎక్కడికో ట్రిప్ కి వెళ్తోంది. అలా షిప్ లో ప్రయాణిస్తూనే ఇలా ఫోటోలు దిగి, వాటిని తన అభిమానులతో పంచుకుంది.

## ఆ సమయంలో అందరికీ దూరంగా...!

తెలుగు లో పలు సినిమాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ మమతా మోహన్ దాస్. ముఖ్యంగా ఎన్టీఆర్ హీరోగా నటించిన యమదొంగ సినిమాలో మమతా మోహన్ దాస్ నటనకి అంతా ఫిదా అయ్యారు. తెలుగు లో కమర్షియల్ సక్సెస్ లు దక్కినా కూడా ఎక్కువ సినిమాల్లో నటించే అవకాశాలు రాలేదు. హీరోయిన్ గా మమతా మోహన్ దాస్ చేసిన సినిమాలు తక్కువే అయినా కూడా పాపులారిటీ విషయంలో స్టార్ హీరోయిన్స్ కి ఏమాత్రం తగ్గలేదు. దాదాపు రెండు దశాబ్దాల సినీ కెరీర్ ను కొనసాగించిన మమతా మోహన్ దాస్ మధ్య లో క్యాన్సర్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్నాళ్లకు సినిమాలకు షూటింగ్స్ కి దూరంగా ఉన్నారు. అప్పటి జ్ఞాపకాలను తాజాగా ఒక ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నారు.



మమతా మోహన్ దాస్ మాట్లాడుతూ... క్యాన్సర్ వ్యాధిని జయించడం కష్టం ఏమీ కాదు. అయితే ఆ సమయంలో చాలా ధైర్యంగా మనో నిబ్బరం గా ఉండాలి. చాలా మంది సానుభూతి చూపించేందుకు ప్రయత్నిస్తారు.. ఆ సానుభూతి అస్సలు పట్టించుకోవద్దు అంది. తాను క్యాన్సర్ బారిన పడ్డ సమయంలో అందరికి దూరంగా వెళ్లి పోయాను. నేను ఎక్కడ ఉన్నాను అనేది కూడా ఎవరికి తెలియకుండా దూరంగా వెళ్లి పోయాను అంటూ చెప్పుకొచ్చింది. ఒంటరిగా ఆసుపత్రిలో చికిత్స పొందాను. ఆ సమయంలో నా తల్లిదండ్రులు ఆండగా ధైర్యంగా నిలిచారు అంది. ప్రస్తుతం రెండు మూడు సినిమాలు చేస్తున్న మమతా మోహన్ దాస్ ముందు ముందు మరిన్ని సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మమతా మోహన్ దాస్ కెరీర్ లో మళ్లీ బిజీ అవ్వాలని కోరుకుంటుంది. అనుకున్నట్లుగానే ఈ అమ్మడు ఆఫర్లు దక్కించుకుంటుంది. త్వరలో టాలీవుడ్ సినిమాకు కూడా ఈమె ఓకే చెప్పే అవకాశాలు లేకపోలేదు.

## 'దేవర' కోసం కర్ణాటక నుంచి ఇసుక బండరాళ్లు!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో భారీ యాక్షన్ థ్రిల్లర్ దేవర తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. యంగ్ టైగర్ మాస్ ఇమేజ్ కి ఏమాత్రం తగ్గకుండా కొరాటాల మార్క్ ఎంటర్ టైనర్ గా రూపొందుతుంది. పీటర్ హెయిన్స్..కెన్నీ బేట్స్ లాంటి ప్రఖ్యాత హాలీవుడ్ స్టంట్ మాస్టర్లు సినిమా కోసం పనిచేస్తున్నారు. ఇప్పటికే సినిమాలో ఓ అండర్ వాటర్ యాక్షన్ సీన్ అదిరిపోతుందని ప్రచారం సాగుతుంది. ఆ సన్నివేశాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చిత్రీకరించారు. అందుకోసం నెలల తరబడి సమయం కేటాయించారు. సముద్ర గర్భంలో జరిగే యాక్షన్ సీన్ కోసం ప్రత్యేకంగా ఓ బ్లూమ్యాట్ ని వేసారు. అచ్చంగా సముద్రాన్ని తలపిస్తుంది. అందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. ఈ సీన్ కోసం వందల మంది ఫైటర్లు పనిచేసారు. ఇలా ఆ యాక్షన్ సన్నివేశానికి చాలా ప్రత్యేకతలు న్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శంషాబాద్‌లో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో జరుగుతోంది. ఇక్కడా కొన్ని యాక్షన్ సన్నివేశాల తో పాటు ఎమోషనల్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. సెంటిమెంట్ సన్నివేశాలు ఎంతో హృద్యంగా ఉండబోతున్నాయని అంటున్నారు. ఆ సన్నివేశాల్లో తారక్ నటన అద్భుతంగా ఉంటుందని చూసిన వారు చెబుతున్నారు. మునుపెన్నడు చూడని సరికొత్త తారక్ ఆయా సన్నివేశాల్లో కనిపిస్తాడని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదో మత్స్యకార గ్రామం చుట్టూ తిరిగే కథ. జాలరి యువకుడి పాత్రలో టైగర్ నటిస్తున్నాడు. తీర ప్రాంతం సెట్ కోసం ప్రత్యేకంగా బీచ్ సెట్ ని రూపొందించారు.సాబు సిరిల్ ఆధ్వర్యంలో ఈ సెట్ నిర్మాణం జరిగింది. సెట్ చాలా సహజంగా ఉంటుంది. అచ్చంగా బీచ్ ..తీర ప్రాంతాన్నే తలపించేలా ఉంటుందని చూసిన వారు చెబుతున్నారు.

ఆర్ట్-ఎఫెక్టివ్‌నెస్- రియలిస్టిక్ లుక్-సెట్‌లో ఒక చివర నీటి తరంగాలను అనుకరించే విధానం చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుందిట. ఇందులో వాడే ఇసుక కూడా బయట రాష్ట్రాల నుంచి తెప్పించినట్లు తెలుస్తోంది. టన్నుల కొద్దీ ఇసుకని కర్ణాటకలోని కొన్ని టాప్ బీచ్‌ల తీసుకొ చ్చారుట. అలాగే అవసరమైన కొన్ని బండరాళ్లును- పెద్ద రాళ్లను కూడా వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చారుట.

## ఫోటో స్టోరి: ప్రతి కుక్కకీ ఒక రోజొస్తుంది!



ప్రతి కుక్కకీ ఒక రోజొస్తుంది... అవును ఇది నిజం! దీనిని కాస్త ఆలస్యంగా అయినా అంగీకరించి తీరాలి ఈ సన్నివేశం చూశాక. అక్కడ అందాల భామ అలా తన పెట్ డాగ్ దరికి చేరి ముద్దులిచ్చేందుకు రెడీ అవుతుంటే ఖంగు తినాల్సొస్తోంది. డాగీ ఎంతగా గారాలు పోతుంటే అంతగా దాంతో ఆటలాడేసుకుంటోంది అందాల షాలిని పాండే. ఇదిగో ఇలా తనతో ఎంతో సన్నిహితంగా ప్రేమగా కలిసిపోయి ఆటలాడేయడమే కాదండోయ్ సంథింగ్ స్పెషల్ తాయిలాన్ని దానికి ఎర వేసింది ఈ అందాల కథానాయిక. గత కొంతకాలంగా షాలిని వరుసగా వేడెక్కించే ఫోటోషూట్లతో చెలరేగిపోతోంది. మునుపటితో పోలిస్తే నేటి కాలానికి తగ్గట్టుగా రివీలింగ్ దుస్తుల్లో వేడెక్కించేస్తోంది. తాజాగా మరోసారి అలాంటి రివీలింగ్ ఫోటోషూట్ అమ్మడి అందాలను ఎలివేట్ చేసింది. తాజా ఫోటోషూట్ లో వెరైటీ దుస్తుల్లో కనిపించిన షాలిని వైట్ టాప్ , డెనిమ్ జీన్స్ తో మతులు చెడగొట్టింది. ఇక వేరొక లుక్ లో షాలిని పూర్తిగా పూల్ సైడ్ ట్రీట్ తో అదరగొట్టింది. అక్కడ బ్లూవాటర్ తో నిండి ఉన్న స్విమ్మింగ్ పూల్ లో జలకాలాడిన షాలిని తన పెట్ డాగ్ కనిపించగానే దాంతో సరసాలాడటం ప్రారంభించింది. ఆ పెట్ డాగ్ ఎంతో మారాం చేస్తూ తనని చేరుకుంది. ఇదిగో ఇలా ఈ పెంపుడు కుక్కకు ముద్దులిచ్చేస్తానంటూ ఊరించింది షాలిని. ఇక స్విమ్ సూట్ లో ఈ కుర్రబ్యూటీ ఎంతో హాట్ గా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో హీట్ పెంచుతున్నాయి. అర్జున్ రెడ్డి భారీ విజయం తర్వాత, షాలిని పాండే 100 పర్సంట్ కాదల్ (100 పర్సంట్ లవ్ తమిళ రీమేక్), మహానటి, 118, ఇద్దరి లోకం ఒకటే, నిశ్శబ్దం వంటి చిత్రాలలో నటించింది. ఆమె చివరిగా హిందీ కామెడీ-డ్రామా చిత్రం జయేష్‌భాయ్ జోర్దార్‌లో రణవీర్ సింగ్‌తో కలిసి కనిపించింది. ఈ చిత్రానికి దివ్యాంగ్ ఠక్కర్ దర్శకత్వం వహించారు. యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై మనీష్ శర్మ - ఆదిత్య చోప్రా సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రంలో బొమన్ ఇరానీ- రత్న పాఠక్ షా కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. షాలిని ప్రస్తుతం తన తదుపరి చిత్రం మహారాజా షూటింగ్‌లో బిజీగా ఉంది. యాక్షన్-అడ్వెంచర్ డ్రామాను బెర్నార్డ్ విలియమ్స్ రాశారు.యుమల్హోత్రా పి. సిద్ధార్థ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో జైదీప్ అహ్లావత్, శర్వరి వాఘ్, సమీర్ పరాంజపే, రేషమ్ సహానీ, జునైద్ ఖాన్ కూడా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంతో అమీర్ ఖాన్ వారసుడు జునైద్ ఖాన్ నటుడిగా పరిచయం అవుతున్నాడు.

## బుట్టబొమ్మకి ఎట్టకేలకు ఓ బిగ్ ఛాన్స్

టాలీవుడ్ లో దాదాపు స్టార్ హీరోలు అందరితో కూడా నటించిన ముద్దుగుమ్మ పూజా హెగ్డే. ఒకానొక సమయంలో స్టార్ హీరోలకు సైతం డేట్స్ ఇవ్వలేనంత బిజీగా కెరియర్ ని కొనసాగించిన హాట్ బ్యూటీ పూజా హెగ్డే ప్రస్తుతం చేతిలో ఒక్క ఆఫర్ కూడా లేకపోవడంతో దిక్కులు చూడాల్సిన పరిస్థితి. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న గుంటూరు కారం సినిమాలో హీరోయిన్ గా ఎంపిక అయి కొన్ని రోజులు షూటింగ్ లో కూడా పాల్గొన్న తర్వాత పూజా హెగ్డేను తొలగించడం జరిగింది. ఆ స్థానంలో కొత్త హీరోయిన్ శ్రీ లీలను ఎంపిక చేయడంతో పూజా హెగ్డే పని అయిపోయిందని అంతా భావించారు. ఆ మధ్య హరీష్ శంకర్ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ హీరో గా రుపొందుతున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో కూడా పూజా హెగ్డే ని హీరోయిన్ గా అనుకున్నారు. కానీ ఆ సినిమా నుంచి కూడా ఈ ముద్దుగుమ్మని తొలగించారని తెలుస్తోంది. మొత్తానికి చేతిలో ఒక్క ఆఫర్ లేకపోవడంతో పూజ హెగ్డే కనుమరుగవు పోతుందేమో అని అంత భావిస్తున్నారు. అయితే సోషల్ మీడియాలో తన హాట్ ఫోటో షూట్స్ ఇంకా బాలీవుడ్ పరిచయాల కారణంగా షాహిద్ కపూర్ కి జోడిగా ఒక బడా చిత్రంలో నటించే అవకాశం దక్కించుకుంది. మలయాళ చిత్ర దర్శకుడు ఆండ్రూస్ దర్శకత్వంలో షాహిద్ కపూర్ హీరోగా రూపొందబోతున్న సినిమాలో పూజా హెగ్డే దాదాపుగా కన్ఫర్మ్ అయిందని హిందీ మీడియా వర్గాల ద్వారా కూడా సమాచారం అందుతుంది. వచ్చే నెల నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి కేవలం మూడు నెలల్లోనే సినిమాను పూర్తి చేసి వచ్చే ఏడాది సమ్మర్ లో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. షాహిద్ కపూర్ తో పూజా హెగ్డే నటించబోతున్న సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంటే ఖచ్చితంగా బాలీవుడ్ తో పాటు మళ్ళీ సౌత్ లో కూడా పూజా హెగ్డే సందడి మూడు నాలుగు సంవత్సరాలు కనిపించే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ సినిమాల మాదిరిగానే షాహిద్ కపూర్ సినిమా కూడా చివరి నిమిషంలో చేజారితే పూజా హెగ్డే ఇక కోలుకోవడం కష్టమే అంటూ సోషల్ మీడియాలో కొందరు కామెంట్స్ చేస్తున్నారు.



## నెపో కిడ్ అని పిలిస్తే ఆలియాకు నచ్చదా?

ఒక నటిగా ఆలియా భట్ చాలా ఎత్తులకు ఎదిగింది. వినోద పరిశ్రమలో అత్యంత ఆదరణ ఉన్న మేటి నాయికగా కీర్తినందుకుంది. గొప్ప కంటెంట్ ఆధారిత సినిమాలు, వాణిజ్యపరమైన సక్సెస్ లతో ఆలియా సంచలనంగా మారుతోంది. ఆలియా కృషి - సంకల్పం తనన పరిశ్రమలో సుస్థిర స్థానానికి చేర్చాయని చెప్పాలి. తల్లిదండ్రులు మహేష్ భట్ - సోనీ రజ్దాన్ తాము గర్వించే కూతురు అంటూ తనపై నిరంతరం పొగడ్తలు కురిపిస్తుంటారు. అయితే ఆలియా భట్ ని నెపో కిడ్ అని.. బంధుప్రీతి ఆదుకుందని కంగన లాంటి స్టార్ నిరంతరం విమర్శిస్తుంటారు. అయితే తాజా ఇంటర్వ్యూలో ఆలియా నెపోటిజం గురించి ప్రస్థావించింది. అలాగే తన తల్లి సోని రజ్దాన్ నటిగా ఎదిగేందుకు ఎలా కష్టపడిందో కూడా రివీల్ చేసింది. ఇన్‌స్టైల్ ఆస్ట్రేలియా మ్యాగజైన్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో.. ఆలియా తన కుటుంబం 'ఒక సినిమా ప్రపంచం' అని తెలుసుకున్నప్పుడు నటనపై



సహజంగానే మొగ్గు చూపినట్లు తెలిపింది. నేను సహజంగానే నటరంగం వైపు ఎక్కువ మొగ్గు చూపాను. కానీ మా నాన్న నాతో ఎమనేవారంటే..."ఓహ్ నువ్వు నటించాలనుకునే రోజున మేం సినిమాలో అవకాశం ఇస్తాం" అని అన్నారు. కానీ నాన్న ఆ అవకాశాన్ని నాకు ఎప్పుడూ ఇవ్వలేదు. నిజానికి మా అమ్మ నటిగా చాలా కష్టపడింది. ఇది చాలా మందికి తెలియదు. ఆమె ఎప్పుడూ నటిగా ఎక్కువ పని కోసం వెతుకుతూనే ఉండేది. కానీ చివరికి ఇదే పిచ్చితో తాను దర్శక నిర్మాతను వివాహం చేసుకుంది! అని తెలిపింది. బంధుప్రీతి గురించి ప్రస్థావిస్తూ.. సినీరంగంలో సులువుగా ప్రవేశించేందుకు ఇది ఉపకరించిందని తెలిపింది. ఇది చాలా రక్షణాత్మకంగా ఉంటుంది. అయితే నేను నటిగా ఎక్కువ కష్టపడుతున్నాననే విషయం మీకు తెలుసనే అనుకుంటాను.. కాబట్టి నన్ను ప్రశ్నించడం ఎందుకు? అని అంది. సమయం వయస్సుతో పాటు ప్రపంచంలో చాలా పోరాటం చేయాల్సి ఉందని నేను భావిస్తున్నాను.. అని తెలిపింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. గంగూబాయి కతియావాడిలో తన అద్భుతమైన నటనకు ఆలియా భట్ ఈ సంవత్సరం జాతీయ అవార్డును అందుకుంది. చివరిగా 'రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీ'లో ఆలియా కనిపించింది. రణవీర్- ఆలియా జంటగా నటించిన రొమాంటిక్ డ్రామా అభిమానులకు నచ్చింది. బాక్సాఫీస్ వద్ద విజయవంతమైంది. ధర్మేంద్ర, షబానా అజ్మీ, జయా బచ్చన్ తదితరులు నటించారు. ఈ చిత్రం ఇప్పుడు OTTలో అందుబాటులో ఉంది. OTT వెర్షన్‌లో అదనపు 10 నిమిషాల సీన్స్ కూడా చేర్చారు. పరిమితి కారణంగా థియేటర్ వెర్షన్ నుండి కత్తిరించారు. హాలీవుడ్ చిత్రం 'హార్ట్ ఆఫ్ స్టోన్'లో కూడా ఆలియా కనిపించింది. అయితే ఇప్పటి వరకు ఆలియా తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించలేదు. తన భర్త రణబీర్ తో కలిసి బ్రహ్మాస్త్ర 2లో నటించాల్సి ఉంది.







## సింగరేణి కార్మికులు, ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. లాభాల్లో 32శాతం వాటా..!

సింగరేణి కార్మికులు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంస్థ సాధించిన లాభాల్లో 32శాతం వాటా చెల్లించేందుకు నిర్ణయించిన సీఎం కేసీఆర్.. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి రూ.2,222 కోట్ల రికార్డు స్థాయి లాభాలను ఆర్జించింది. ఇందులో రూ.700కోట్లకుపైగా లాభాలను కార్మికులకు దసరా ముందస్తుగా చెల్లించనున్నట్లు సీఎం కేసీఆర్ రెండు నెలల కిందట మంచిర్యాలలో ప్రకటించారు. ఈ క్రమంలో ఇచ్చిన మాటమేరకు గతంలో గతంలో 30శాతానికి మించి కార్మికులకు రూ.700కోట్లకుపైగా లాభాల్లో వాటా వచ్చేలా 32శాతం వాటా రూ.711 కోట్లను ప్రకటించారు. ఇటీవలనే కార్మికులకు 11వ వేతన ఒప్పందానికి సంబంధించి 23 నెలల బకాయిలు దాదాపు రూ.1,450 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. అక్టోబర్ 23న దసరా ఉండడంతో ముందుగానే లాభాల్లో వాటాను చెల్లించేలా సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కార్మికులకు వాటా వస్తుండడంతోపై కార్మిక లోకం హర్షం వ్యక్తం చేస్తున్నది.




## ఆంధ్రాలో పంచాయితీ.. అక్కడే తేల్చుకోవాలి: కేటీఆర్

హైదరాబాద్: తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టు వ్యవహారం పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంశం.. ఆంధ్రా పంచాయితీ అక్కడే తేల్చుకోవాలని తెలంగాణ మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీ పంచాయితీలకు తెలంగాణను వేదిక కానివ్వమని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలను తెదేపా, వైకాపా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. "చంద్రబాబు అరెస్టు ఏపీలో రెండు రాజకీయ పార్టీల మధ్య జరుగుతున్న యుద్ధం. మా పార్టీ నేతలు స్పందిస్తే అది వారి వ్యక్తగత వ్యవహారం. తెలంగాణ ప్రజలు, తెలంగాణ రాష్ట్రంపై ఎలాంటి ప్రభావం చూపించే అంశం కాదు. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న రాజకీయ వివాదాలతో తెలంగాణకు సంబంధం లేదు. చంద్రబాబు అరెస్టు అయింది ఆంధ్రప్రదేశ్‌లో. ర్యాలీలు, ధర్నాలు చేయాలనుకుంటే అక్కడే చేయాలి. ఎవరూ అడ్డుకోరు. అక్కడ చేయకుండా ఇక్కడ రాజకీయ రాద్ధాంతం చేస్తానంటే ఎలా. తెలంగాణలో ఇవాళ ఒకరు ర్యాలీ చేస్తే.. రేపు మరొకరు చేస్తారు. పక్కింటి పంచాయితీ కూడా ఇక్కడ తేల్చుకుంటారా? విజయవాడలో, అమరావతిలో, రాజమహేంద్రవరంలో ర్యాలీలు చేయండి. ఒకరితో మరొకరు తలపడండి.

**చంద్రబాబు న్యాయ పోరాటం చేస్తున్నారు..** ఏపీలో ఉన్న సమస్యపై హైదరాబాద్‌లో కొట్లాడతా అంటే ఎలా? ఇది సరైంది కాదు. ఇక్కడ మేం ఒక ప్రభుత్వాన్ని నడుపుతున్నాం. శాంతిభద్రతల సమస్య వస్తే ఎలా? ఇలాంటి వాటికి ఇక్కడ ఎలా అనుమతిస్తాం. వాళ్ల ఘర్షణలకు హైదరాబాద్ వేదిక ఎలా అవుతుంది. ఆ రెండు పార్టీలకు తెలంగాణలో ఉనికి లేదు.. స్థానం లేదు. తెలంగాణలో అన్ని ప్రాంతాల వారు కలిసిమెలసి ఉన్నారు. చంద్రబాబు అరెస్టు వ్యవహారంలో మేం తటస్థంగా ఉన్నాం. ఇలాంటివి చాలా సున్నితమైన అంశాలు. వాటిని చాలా జాగ్రత్తగా హ్యాండిల్ చేయాలి. ప్రస్తుతం ఈ విషయం న్యాయస్థానం పరిధిలో ఉంది. ఈ సమయంలో రోడ్లపైకి వచ్చి ఎవరు పడితే వారు ఏది పడితే అది మాట్లాడకూడదు. చంద్రబాబు న్యాయ పోరాటం చేస్తున్నారు. ఆయనకు జరగాల్సిన న్యాయం కోర్టుల్లో జరుగుతుంది" అని కేటీఆర్ వివరించారు.

**లోకేశ్.. పవన్.. జగన్.. నా మిత్రులే..** "లోకేశ్ .. జగన్.. పవన్ కల్యాణ్ నాకు మంచి స్నేహితులు. అందరూ దోస్తులే. ఆంధ్రాలో నాకు తగాదాలు లేవు. ఇప్పటికిప్పుడు యుద్ధాలు చేయాల్సిన అవసరం కూడా లేదు. అలాగే వారికి కూడా అలాంటి అవసరం లేదు. ప్రాంతాలతో సంబంధం లేకుండా హైదరాబాద్‌లో అందరూ కలిసి మెలసి ఉంటున్నాం. ఇక్కడ లేని పంచాయితీలు ఎందుకు పెట్టాలి. ఇక్కడున్న ఆంధ్రా ప్రజలు పదేళ్ల నుంచి సంతోషంగా ఉన్నారు. ఇక్కడికి వచ్చి వాళ్లను ఇబ్బంది పెట్టడం సరికాదు. ర్యాలీలకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ఓ మిత్రుడి ద్వారా లోకేశ్ ఫోన్ చేయించారు. ఒకరికి అనుమతిస్తే.. ఇంకొకరు ర్యాలీ చేస్తారు. అందుకే అనుమతించడం లేదని చెప్పా. ఐటీ కారిడార్‌లో తెలంగాణ ఉద్యమం సమయంలో కూడా ఉద్యమాలు జరగలేదు. అప్పటి ప్రభుత్వాలు కూడా అనుమతి ఇవ్వలేదు. ఐటీ కార్యకలాపాలు దెబ్బతినొద్దు. ఏపీ నుంచి ఎంతో మంది ఇక్కడికొచ్చి పెట్టుబడులు పెడుతున్నారు. వాళ్ల పెట్టుబడులు, భవిష్యత్తు బాగుండాలి. అలా ఉండాలంటే హైదరాబాద్‌లో శాంతి భద్రతలు అదుపులో ఉండాలి" అని కేటీఆర్ అన్నారు.

## గణేష్ నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు : మంత్రి తలసాని

హైదరాబాద్ : ప్రశాంత వాతావరణంలో గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం జరిగే విధంగా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ లోని పలు ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సర్కిల్, ప్యాట్నీ సర్కిల్, ప్యారడైజ్ సర్కిల్, బోట్స్ క్లబ్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు ఏర్పాట్లపై తగు సూచనలు చేశారు. శోభాయాత్ర నిర్వహించే మార్గాలలో లైటింగ్ ఏర్పాటు చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో రహదారుల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా విగ్రహాలతో వచ్చే వాహనాలకు ఆటంకం కలగకుండా చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలు అడ్డం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తుల కోసం వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జనం కోసం వచ్చే విగ్రహాలకు స్వాగతం పలికే విధంగా స్టేజీలను ఏర్పాటు చేయాలని ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, నార్త్ జోన్ అడిషనల్ డీసీపీ మధుసూదన్, వాటర్ వర్క్స్ సీజీఎం ప్రభు, ఆర్ అండ్‌బీ ఈఈ రవీంద్ర మోహన్, జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, మాజీ కార్పొరేటర్లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, శీలం ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, ఆకుల హరికృష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## త్వరలోనే కొత్త పీఆర్సీ

సిద్దిపేట: రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన లక్ష కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వ పక్షపాత ధోరణి వల్ల రాలేదని మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యానించారు. మంగళవారం నాడు టీటీసీ భవన్‌లో టీఎస్‌యూటీఎఫ్-తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సిద్ధిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు నిరంజన్ సంస్మరణ సభ జరిపారు.



మంత్రి హరీష్‌రావు హాజరై కుటుంబ సభ్యులకు రూ.6 లక్షల సంక్షేమ నిధి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఉద్యోగులకు 71 శాతం ఫిట్మెంట్ ఇచ్చిన ప్రభుత్వం దేశంలో మరోకటి లేదు. త్వరలోనే సీఎం కేసీఆర్ కొత్త పీఆర్సీ వేయనున్నారని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు.



# పవన్ సమర్ధతకు పరీక్ష

## తడబడతారా - నిలబెడతారా..!!

హైదరాబాద్ : ఏపీలో పవన్ టీడీపీతో పొత్తు ఖాయం చేసారు. బీజేపీతో మిత్రపక్షంగా ఉంటూనే టీడీపీతో కలిసారు. బీజేపీ కలిసి రావాలని పిలుపునిచ్చారు. తానే బీజేపీ నేతలను కలిసి తన నిర్ణయం వెను కారణాలను వెల్లడిస్తాన ని చెప్పుకొచ్చారు. బీజేపీ వైఖరి ఏంటనేది స్పష్టత రావాల్సి ఉంది. ఇదే సమయంలో తెలంగాణ ఎన్నికలు సమీపిస్తున్నాయి. తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందని గతంలోనే పవన్ ప్రకటించారు. ఇక్కడ పవన్ ప్రత్యర్థి ఎవరు. పవన్ ఎవరితో కలిసి వెళ్తారు. పోటీకి సిద్ధమేనా : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు మరో పది రోజుల్లో షెడ్యూల్ వెలువడే అవకాశం కనిపిస్తోంది. తెలంగాణలో బీజేపీతో పొత్తు ఉండదని..ఎన్ని సీట్లలో పోటీ చేయాలో పార్టీ నిర్ణయిస్తుందని చంద్రబాబు ఢిల్లీ పర్యటన వేళ ప్రకటించారు. తరువాత చంద్రబాబు అరెస్ట్ సమయంలో పవన్ తాము టీడీపీతో కలిసి వెళ్తామని ఏపీలో వైసీపీ పాలన పోవాలని నినదించారు. ఏపీ, తెలంగాణకు ఎల్లో అలర్ట్ తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందని గతంలోనే ప్రకటించిన పవన్ సీట్ల సంఖ్య కూడ ప్రస్తావించారు. ఇప్పుడు అన్ని పార్టీలు తమ అభ్యర్దులను ఖరారు చేస్తున్నాయి. పవన్ మాత్రం ఆ దిశగా ఎటువంటి కార్యాచరణ అమలు చేయటం లేదు. కానీ, తెలంగాణలో మాత్రం జనసేన పోటీ ఖాయమని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. పొత్తులు ఉంటాయా : తెలంగాణలో తమకు ఎవరితో నూ పొత్తు ఉండదని ఆ రాష్ట్ర బీజేపీ నేతలు పదే పదే చెబుతున్నారు. బీజేపీ నాయకత్వం సైతం తమ అభ్యర్దుల ఎంపిక కసరత్తు వేగవంతం చేసింది. దీంతో, ఇక జనసేనతో పొత్తు లేదనే భావించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయా లేదా అనేది మరో చర్చ. ఈ రెండు కలిసి పోటీ చేస్తే ఎవరి ఓట్లకు గండి కొడతారు. వీరద్దరి పొత్తు బీజేపీ- బీఆర్ఎస్ లో నష్టం చేసేదెవరికి..మేలు చేసెదెవరికి అనే లెక్కలు మొదలయ్యాయి. ఈ ఎన్నికల్లో పవన్ పార్టీకి అనుకూలంగా ప్రచారం చేస్తే కేసీఆర్ ను లక్ష్యంగా చేసుకుంటారా.. బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేయమని పిలుపు ఇస్తారా అంటూ ప్రశ్నలు ఇప్పటికే వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న పవన్ నుంచి బీజేపీ తెలంగాణలో ఏం ఆశిస్తుందనేది స్పష్టత రావాల్సి ఉంది. చంద్రప్రభ వాహనంపై తిరుమలేశుడు.. చిక్కులు - లెక్కలు : తెలంగాణ నేతలు పొత్తులు వద్దని చెబుతున్న క్రమంలో పవన్ సేవలను తెలంగాణలో వినియోగించుకోవటం సందేహంగానే కనిపిస్తోంది. దీంతో, వెళ్తే టీడీపీతో లేకుంటే ఒంటరిగానే పవన్ పోటీ చేయాల్సి ఉంటుంది. ఏపీ ఎన్నికలే లక్ష్యంగా పొత్తుల లెక్కలతో ముందుకు వెళ్తున్న పవన్ కు తెలంగాణ రాజకీయం సమర్ధతకు పరీక్షగా మారుతోంది. ఇన్ని సందేహాలు..చిక్కుల మధ్య అసలు పవన్ తెలంగాణలో పోటీ విషయంలో తన నిర్ణయం చివరి నిమిషంలో ఎలా ఉంటుందనేది మరో చర్చ. చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చిన తరువాతనే దీని పైన నిర్ణయం ఉంటుందనేది పార్టీ నేతల అభిప్రాయం. దీంతో, ఇప్పుడు ఏపీపైన గురి పెట్టిన పవన్..తెలంగాణ విషయంలో పోటీకి నిలబడతారా లేదా అనేది చూడాలి..

## ఒకప్పుడు టీయారెస్ లో నంబర్ టూ...ఇపుడు పాపం పరిస్థితి ఇలా ఉంది....!



హైదరాబాద్ : ఆమె ఫైర్ బ్రాండ్. తెలంగాణా ప్రజలకు రాములమ్మ. మూడు దశాబ్దాల పాటు సినీ రంగంలో సంపాదించుకున్న పేరు ప్రఖ్యాతులతో ఆమె రాజకీయ అరంగేట్రం చేశారు. తొలుత సొంత పార్టీ పెట్టినా తరువాత బీజేపీలో ఉన్నారు. అయితే తెలంగాణా ఉద్యమ సమయంలో ఆమె టీయారెస్ లో చేరి కేసీయార్ కి సిసలైన చెల్లెమ్మగా మారిపోయారు. ఇద్దరే ఇద్దరు ఎంపీలు కేసీయార్, విజయశాంతి తెలంగాణా రాష్ట్రం సాధించే సమయంలో ఉన్నారు. ఆయన విజయశాంతి టీయారెస్ లో నంబర్ టూ గా కీలకమైన పాత్ర పోషించారు. అనంతరం కాంగ్రెస్ మీదుగా బీజేపీలోకి వచ్చి చేరారు అయితే ఆమెకు బీజేపీలో తగిన గౌరవం అయితే దక్కడంలేదు అంటున్నారు. ఆమె పార్టీలో ఉన్నారంటే ఉన్నారు అన్నట్లుగా పరిస్థితి మారింది. ఇదిలా ఉంటే ఆమె తెలంగాణా బీజేపీ మాజీ ప్రెసిడెంట్ బండి సంజయ్ వైపు ఉన్నారన్న ప్రచారం ఆమెకు ఇబ్బంది గా మారిందా అన్నది ఒక చర్చ. ఎందుకంటే అప్పట్లో ఆమె బండి సంజయ్ ని మార్చకుండా ఉండాల్సింది అని ఒక ప్రకటన చేశారు. ఇదిలా ఉంటే తెలంగాణాలో సీడబ్ల్యూసీ మీటింగ్ ఇటీవల జరిగింది. ఈ మీటింగ్ మీద కూడా విజయశాంతి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. అయితే ఆమె సోనియాగాంధీ అంటే తనకు గౌరవం, వ్యక్తిగతంగా అభిమానం అంటూ చేసిన కామెంట్స్ ఇపుడు బీజేపీలో అగ్గి పుట్టిస్తున్నాయి. విజయశాంతి పార్టీ మారిపోతారు అని కూడా ప్రచారం స్టార్ట్ చేశారు. దాని మీద లేటెస్ట్ గా ఆమె మరోసారి ఫైర్ అయ్యారు. సొంత పార్టీ వారే ఇలా ప్రచారం చేస్తున్నారు అని మండిపడ్డారు. కొందరు నేతలు పనిగట్టుకుని మరీ ఇలా దుష్ప్రచారం చేస్తున్నారు అని ఆమె విమర్శించారు. అంతే కాదు పార్టీలో జరుగుతున్న అంతర్గత పరిణామలను కొందరు నేతలు లీక్ చేస్తున్నారు అని ఆమె చెప్పడం విశేషం. అలా విజయశాంతి బీజేపీలో కొందరు నేతల మీద టార్గెట్ చేసినట్లుగా కనిపిస్తోంది అంటున్నారు. పార్టీలో బండి సంజయ్ వ్యతిరేక వర్గం ఆమె మీద ఇలా దుష్ప్రచారం చేస్తోంది అని అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే దగ్గరలో ఎన్నికలు ఉన్నాయి. ఈ టైంలో ఐక్యంగా ఉండాల్సిన బీజేపీలో ఈ లుకలుకలు ఏంటి అన్న చర్చ కూడా మొదలైంది. పార్టీలో వర్గాలు ఉన్నాయని గ్రూపులు రగులుతున్నాయని విజయశాంతి మాటలతో తేటతెల్లమైంది అని అంటున్నారు. ఏది ఏమైనా ఈ పరిణామాలు ఎన్నికల వేళ కమలం పార్టీకి మంచిది కాదు అనే అంటున్నారు. కానీ అగ్గి అయితే రాజుకుంది. దాన్ని ఆర్పడం వల్ల కాదు అనే అంటున్నారు. చూడాలి మరి ఇది ఎంత దాకా వెళుతుందో. ఏది ఏమైనా విజయశాంతి బీజేపీలో ఏమీ కాకుండా ఉన్నారా అన్నదే ఆమె అభిమానుల వేదనగా ఉందిట.

## కేటీఆర్ షాడో సీఎం : కిషన్‌రెడ్డి



నిజామాబాద్ జిల్లా: ఉత్తర తెలంగాణలో బీజేపీ కీలక పాత్ర పోషిస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం నాడు నగరంలోని గిరిరాజ్ కాలేజీ మైదానలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.."అక్టోబర్ 3వ తేదీన ప్రధాని మోద పర్యటన వస్తారు. 8 వందల మెగా వాట్ల విద్యుత్ ప్రాజెక్ట్‌కు వర్చువల్‌గా ప్రారంభిస్తారు. లక్ష మందితో సభ నిర్వహిస్తున్నాం. ఖమ్మంలో కూడా పార్టీ బలపడింది. మోదీ పర్యటన రాష్ట్ర రాజకీయాలకు దిశా నిర్దేశంగా ఉండబోతోంది. మోదీ పర్యటన తర్వాత అమిత్‌షా, నడ్డా పర్యటనలు ఉంటాయి. అక్టోబర్ 1వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తాం. హామీలపై కేటీఆర్ కు సమాధానం చెప్పే అవసరం మాకు లేదు.

కేటీఆర్ షాడో సీఎం. తెలంగాణ కేటీఆర్ జాగీరా..? 17 సార్లు నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వక పోవడం సిగ్గుచేటు. బీఆర్ఎస్ నేతల ఎజెండాలో మేము పడబోం. ఎమ్మెల్సీలపై గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ నిర్ణయం సరైనదే. అనర్హులకు పదవులు కట్టబెట్టడం సిగ్గుచేటు. పసుపు బోర్డు ఏర్పాటు అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## రేషన్ కార్డుల కేవైసీ ప్రక్రియ.. పునఃసమీక్షించాలని కేంద్రాన్ని కోరిన మంత్రి గంగుల కమలాకర్

హైదరాబాద్ : రేషన్ కార్డుల కేవైసీ ప్రక్రియపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ లేఖ రాశారు. ప్రవాస తెలంగాణీయుల ప్రయోజనాలు కాపాడడానికి నిబంధనలు పునఃసమీక్షించాలని కేంద్రాన్ని కోరారు. తెలంగాణ రేషన్ కార్డుదారుల ప్రయోజనాలు ముఖ్యమంత్రి కేసీఆర్ కాపాడతారు. తెలంగాణ పౌరులెవరూ ఆందోళనలకు గురికావద్దు అని మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి మంత్రి గంగుల కమలాకర్ లేఖ రాశారు. ఆహారభద్రతా కార్డుల్లో నూతనంగా కేవైసీ నిబంధనలు అమలు చేయాలనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో తెలంగాణ ప్రజల్లో నెలకొన్న తీవ్ర ఆందోళనకర పరిస్థితులను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దేశం మొత్తం పరిస్థితులకు తెలంగాణ పరిస్థితులకు గల వైవిధ్యం విభిన్నమైనది. దశాబ్దాల కాంగ్రెస్ పాలనా వైఫల్యాల వల్ల సరైన ఉపాధి లేక ఇక్కడి ప్రజలు పెద్ద సంఖ్యలో గల్ఫ్, ఇతర దేశాలతో పాటు దేశంలోని ముంబై, భీవండి తదితర ప్రాంతాలకు పెద్ద ఎత్తున వేలాది మంది వలసలు పోయి బతికే దౌర్భాగ్య పరిస్థితులు తలెత్తాయి. ఈ దుస్థితిని రూపుమాపడానికే తమ సీఎం కేసీఆర్ సారథ్యంలో సుదీర్ఘ పోరాటం చేసి తెలంగాణను సాధించుకున్నాము. సాధించిన తెలంగాణను దేశంలోనే అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుకుంటున్నాము. ఇప్పటికే సాగునీరు, తాగునీరు, పరిశ్రమల ఏర్పాటు తదితర కీలక రంగాల్లో గణనీయమైన వృద్ధిని సాధించి మౌళిక వసతులు సహా అన్ని రంగాల్లో దేశానికి మార్గనిర్ధేశకత్వం వహిస్తున్నాము. ఈ కృషితో ప్రస్తుతం వలసలను అరికట్టడంతో పాటు గతంలో వలసపోయిన తెలంగాణ ప్రజలు పెద్ద ఎత్తున తిరిగి స్వరాష్ట్రం రావడానికి ప్రోత్సాహిస్తున్నామని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. అయితే దశాబ్దాలుగా అపరిష్కృతం కానీ సమస్యలను కేవలం తొమ్మిదేళ్ల స్వల్ప సమయంలో పూర్తిగా రూపుమాపడం ఎంతటి కష్టసాధ్యమో పాలకులుగా మీకు తెలియనిది కాదు అని మంత్రి తన లేఖలో పేర్కొన్నారు.

## ఐటీ హబ్‌ల ఏర్పాటు ఘనత సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌దే : మంత్రి జగదీష్ రెడ్డి

సూర్యాపేట : తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అయితే, తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు తెలిసేలా చేసిన గొప్పతనం ఐటీ మంత్రి కేటీఆర్‌ది అని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. పట్టణ ప్రాంతాల్లో సైతం ఐటీ హబ్ ఏర్పాటుకు మూలం కేసీఆర్, కేటీఆరే కారణమన్నారు. సూర్యాపేటలో త్వరలో ప్రారంభం కానున్న ఐటీ హబ్‌కు గాను టాస్క్ ఆధ్వర్యంలో ఐటీ కంపెనీలు నిర్వహించిన జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి యువతను ఎంకరేజ్ చేశారు. ఉద్యమ సమయంలో చేసిన ఉపన్యాసాలు నేడు నిజం అయ్యాయని, 2018 ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఎన్నికల హామీ నెరవేర్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ముఖ్య మంత్రి కేసీఆర్ విజన్ దేశానికే రోల్ మోడల్ అన్నారు.

ప్రపంచ దేశాలను ప్రభావితం చేయగల విజ్ఞానం, పరిపాలన దక్షిత కేటీఆర్ సొంతం అన్నారు. ఇంటి దగ్గరే ఉండి ఐటీ ఉద్యోగం చేసుకునే అవకాశం సూర్యాపేట యువతకు దక్కబోతుందని పేర్కొన్నారు. ఎన్నో ఆశలతో ఉద్యోగాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రాంతాల్లోని యువత కోసమే ఐటీ హబ్ ను విస్తరించడానికి కారణమన్నారు. ఈరోజు జాబ్ మేళాకు వచ్చిన విశేషం విశేష స్పందన దృష్ట్యా మరోసారి జాబ్ మేళాను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com